ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 26.0

నడక మారింది..

పాలనా వ్యవహారాల్లో ఇక చురుకుదనం

- గడిచిన ఐదేళ్ల లోపభూయిష్టాలు అధిగమించేలా చర్యలు
- ఇప్పటికే కలెక్టర్, ఎస్పీలు పాలనలో తమదైన ముద్ర.. ముక్కుసూటిగా చర్యలు
- ఇంకొంతమందికి త్వరలోనే స్థానచలనం
- ఆ దిశగానే కూటమి ప్రభుత్వం ముందుకు

ప్రభుత్వం మారింది. ప్రజలు ఆశించినట్టు పాలనలో అనేక మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నాయి. అధికారుల్లో కొందరికి స్థాన చలనం కలిగింది. అదే బాటలో రాబోయే కొద్ది రోజుల్లోనే ఇంకొందరికి తప్పదు. కలెక్టర్, ఎస్పీ, జేసీగా కొత్త వారిని నియమించిన తర్వాత పాలన వేగం పుంజుకుంది. వైసీపీకి అనుకూలంగా వ్యవహరించిన అధికారుల్లో కొందరు ఇప్పటికే సర్దుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. ఏదేమైనా ఆగస్టు 15 నాటికి మరికొంత ప్రక్షాళన జరిగేలా కూటమి ప్రభుత్వం సిద్ధపడుతోంది.

- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

ఐదేళ్లపాటు జిల్లా యంత్రాంగంలో ఎక్కడలేని స్తబ్దత. అటు రెవెన్యూ అయినా, ఇటు పోలీస్ అయినా ఏదైనా ఒక్కటే. అధికారంలో ఉన్న వైసీపీ నేతల కనుసన్నల్లోనే వ్యవహారం సాగేది. కొత్త రేషన్‌కార్డులు కావాలన్నా, ఇంటి పట్టాలు అవసరం వున్నా అదంతా వలంటీర్ల ఏకపక్షమే. ప్రభుత్వ కార్యాలయాలన్నీ నిస్తేజంగా మారాయి. సమాంతరంగా గ్రామ, వార్డు సచివాలయాలు అవసరం వున్నా, లేకున్నా కిక్కిరిసి కనిపించేవి. కలెక్టరేట్‌లోను, రెవెన్యూ హెడ్ క్వార్టర్స్ లోనూ ప్రతీ సోమవారం సాగే విన్నపాలకు పరిష్కారం దక్కింది కొన్నే. వైసీపీ నేతలు చెప్పిందే వేదంగా రెవెన్యూ వ్యవహారాలన్నీ కదిలాయి. భూముల వ్యవహారంలో రిజిస్ట్రేషన్ శాఖ తలూపింది. పోలీస్ వ్యవస్థలోనూ ఏకపక్షమే. ఆనాటి సిట్టింగ్ ఎమ్మెల్యేలే కాదు వారి కుడి, ఎడమలుగా పేరొందిన వారి నోరు తెరిస్తే తప్ప కేసు నమోదయ్యేదే కాదు. కొందరు న్యాయవాదులు జోక్యం చేసుకున్నా విచారణ పేరుతో జాప్యం చేసేవారు. జగన్ ప్రభుత్వం వ్యవహార శైలితో గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ఎంపీపీ కార్యాలయాలు నామమాత్రం అయ్యాయి. ఇక సహకార రంగం చెప్పనక్కర్లేదు. డీసీసీబీ, డీసీఎంఎస్‌లు ఎప్పుడో వెనుకడుగు వేశాయి. కిందిస్థాయిలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు దివాలా తీశాయి. డెల్టా ఆధునికీకరణను పక్కన పెట్టేశారు. రేషన్ ఇచ్చి నంత ఇచ్చినట్టు లేకపోతే లేదు. బియ్యం అక్రమ రవాణా అల వోకగా సాగింది. విద్యార్థులకు అవసరమైన శిక్షణ పడకేసింది. ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ దగ్గర నుంచి మిగతావన్నీ మూలన పడ్డాయి. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులు ఏటా బావురమన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు సర్కారు సేవలోనే కొన్నాళ్లపాటు తరించినా చివరకు చాలనుకున్నా చేతులు కాలాయి.

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా జిల్లాస్థాయిలో అధికార యంత్రాంగాన్ని గాడిన పెట్టే ప్రయత్నాలు అమలులోకి వచ్చాయి. కలెక్టర్‌గా వెట్రిసెల్విని నియమించారు. ఆమె బాధ్యతలు స్వీకరించిన తర్వాత కుక్కునూరు, వేలేరుపాడుల్లో వరదలు ముంచెత్తాయి. పెదవాగు ప్రాజెక్టుకు గండి పడింది. డజన్ల కొద్దిగ్రామాల్లో నివాసిత ప్రాంతాలు దెబ్బతిన్నాయి. ఈ తరుణంలో ఆమె అధికారులను వెంట పెట్టుకుని వరద ప్రాంతాలకు వెళ్లి స్థానికులకు ధైర్యం చెప్పారు. కింది స్థాయి అధికారులు వారిస్తున్నా తన గన్‌మెన్ సాయంతో ద్విచక్ర వాహనం పైనే కలెక్టర్ పెదవాగు గండిని స్వయంగా పరిశీలించారు. జరిగిన నష్టం, కారణాలను ఉన్నత స్థాయి అధికారులకు నివేదించారు. తాగునీరు, ఆహార పదార్థాలను బాధితులకు అందేలా చేయడంలో తానే దగ్గరుండి పర్యవేక్షించడంతో వెట్రి సెల్వి సమర్థతను చాటు కున్నారు. కుక్కునూరులో ఒకవైపు వరదలు కొనసాగుతుండగానే తెలంగాణకు ఇసుక అక్రమ రవాణాకు కొందరు సాహసించారు. ఇది తమ దృష్టికి వచ్చిన వెంటనే కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాలతో అధికారులను రంగంలోకి దింపి ఇసుక లారీలను సీజ్ చేశారు. ఎక్కడికక్కడ ఇసుక నిల్వలు పరిమాణాన్ని లెక్క కట్టించారు. విధి నిర్వహణలో అలక్ష్యంగా వ్యవహరించిన కొందరికి నోటీసులు ఇచ్చారు. దీంతో ఇసుక స్మగ్లర్లు గప్‌చుప్ అయ్యారు.



గాంధీనగర్ అంగన్‌వాడీ సెంటర్లో చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

కలెక్టర్, ఎస్పీ సమన్వయంతో..

ఎస్పీగా బాధ్యత తీసుకున్న రోజు నుంచే ప్రతాప్ శివ కిషోర్‌కు గోదావరి వరదలు ఒక సవాలుగానే మారాయి. పూర్తిస్థాయి అవగాహనతో కలెక్టర్ వెట్రిసెల్వి వెంటే నడిచారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో తమ యంత్రాంగాన్ని సహాయ కార్యక్రమాలకు ఒకవైపు కదిలిస్తూనే మరోవైపు కలెక్టర్ ఆదేశాలను యథావిధిగా అమలయ్యేలా చూశారు. పెదపాడు మండలాన్ని పట్టి పీడిస్తున్న కోళ్ళ వ్యర్థాల దిగుమతిని అడ్డుకునేలా కఠినమైన ఉత్తర్వులు జారీ చేశారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వాహనంపై రెండు రోజుల క్రితం దాడి జరిగినట్టు ప్రచారం సాగక దీనిని 24 గంటల్లోనే పూర్తిగా ఛేదించి అది నిజం కాదన్నట్టుగా తేల్చగలిగారు. డీఎస్పీ స్థాయి అధికారులను రంగంలోకి దింపడం వలనే ఇది సాధ్యమైంది. ఈ చర్యతో ఎస్పీ.. చాలా స్పీడు గురూ అంటూ కామెంట్లు వచ్చాయి. ఇంకోవైపు ఎస్పీ సతీమణి ధాత్రి రెడ్డి జాయింట్ కలెక్టర్‌గా వచ్చారు. ఆమె కూడా కుక్కునూరు, వేలేరుపాడుల్లో వరద సహాయక చర్యల్లో పాలు పంచుకుని శాఖాపరమైన విభాగాల సమీక్షల్లోనూ మునిగి తేలారు. ఇలా కలెక్టర్, ఎస్పీ, జేసీ జిల్లా పాలనా వ్యవహారాల్లో తమదైన మార్పు చూపించేందుకు అడుగులు వేస్తున్నారు.

ఇంకొందరికి స్థాన చలనం ?

జిల్లాలో మరికొంత మంది అధికారులను మార్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఎన్నికల నిర్వహణలో భాగంగా అప్పట్లో తహసీల్దార్‌లను బదిలీ చేశారు. తాజాగా వీరి పునర్నియామకానికి ఎన్నికల కమిషన్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో బదిలీ అయిన తహసీల్దార్లు ఒక్కొక్కరిగా జిల్లా నుంచి నిష్క్రమిస్తున్నారు. ఇంకోవైపు కీలక విభాగాల్లో ఉన్న జిల్లాస్థాయి అధికారులను కొంత మార్చవచ్చని వినిపిస్తోంది. సుమారు అరడజను మందిని మార్చేందుకు కసరత్తు జరుగుతున్నట్టు సమాచారం.

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలి : జేసీ

ఏలూరుసిటీ, జూలై 31 : ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేలా కృషి చేయాలని జేసీ ధాత్రిరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం, నాణ్యమైన వస్తువుల పంపిణీ, పంపిణీ విధానం, ధరల స్థిరీకరణ, తదితర అంశాలుపై వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలను, వారి సమస్యలను జేసీ అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్టు తెలిపారు. పౌర సరఫరాలు, రెవెన్యూ, ఫుడ్‌సేఫ్టీ , తూనికలు కొలతలు అధికారులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసి అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో ఆహార నాణ్యతలు తరచూ తనిఖీలు చేయాలని జేసీ అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణలో మిల్లర్ల సమస్యలు, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీలో రేషన్‌షాప్ డీలర్లు, ఎండీయూ వాహనదారులు, సూచనలు, సమస్యలను జేసీ అడిగి తెలుసుకున్నారు. డీఎస్‌వో ఆర్‌ఎస్ సత్యనారాయణరాజు, పౌరసరఫరాల సంస్థ డీఎం మంజూభార్గవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి : కలెక్టర్

చింతలపూడి, జూలై 31 : 'ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలి. మెరుగైన వైద్యసేవలు అందించాలి. వైద్యాధికారులు వారికి కేటాయించిన సమయాల్లో విధులు నిర్వర్తిస్తూ రోగులకు సేవలు అందించాలి. వంద పడకల ఆస్పత్రిని త్వరలోనే పూర్తి చేస్తాం' అని కలెక్టర్ వెట్రిసెల్వి పేర్కొన్నారు. చింతలపూడిలో కలెక్టర్ బుధవారం పర్యటించి ఏరియా ఆస్పత్రి, ప్రభుత్వ హైస్కూల్, గాంధీనగర్‌లోని అంగన్‌వాడీ సెంటర్, మున్సిపల్‌శాఖ పనితీరు, పట్టణంలో పారిశుధ్యం తదితర విషయాలను ఆమె పరిశీలిం చారు. ఏరియా ఆస్పత్రిలోని వార్డులను, ఆపరేషన్ థియేటర్, ఓపీ కేంద్రం తదితర విభాగాలను పరిశీలించి డాక్టర్లతో సమావేశమై సమీక్షించి ఆస్పత్రిలో అందుతున్న వైద్యసదుపాయాలు తెలుసుకున్నారు. ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను భర్తీ చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠను ఆదేశించారు. ఆస్పత్రికి ఎక్కువగా వస్తున్న కేసుల వివరాలను సూపరింటెండెంట్ రసూల్ తెలిపారు. ఇక్కడ ఆరు డెంగీ కేసులు నమోదైనట్టు డీఎంహెచ్‌వో వివరించారు. చింతలపూడి నగర పంచాయతీ పరిధిలో పారిశుధ్యం నిర్వహణలో లోపాలు ఉన్నాయని ఫిర్యాదులు రావడంతో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెరుగైన చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదుల కోసం కాల్‌సెంటర్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. జిల్లాలోనే ఈ పాఠశాల 10వ తరగతిలో 88.53 శాతం ఉత్తీర్ణత సాధించిందని, ఈ ఏడాది 77 మంది విద్యార్థులు అదనంగా పెరిగారని కలెక్టర్‌కు హెచ్‌ఎం సుధాకర్ వివరించారు. ఉపాధ్యాయుల కొరత ఉందని భర్తీ చేయాలని కోరారు. గాంధీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి బాలింతలకు బాలా మృతం ప్యాకెట్లను అందజేసి పిల్లలతో ముచ్చటించారు. వెలగలపల్లిలో మంచినీటి ట్యాంకులు పరిశీలించి నీటి నమూనాలను పరీక్షలకు పంపుతున్నారా ? లేదా ? అడిగి తెలుసుకున్నారు. నూజివీడు ఆర్డీవో వై.భవాని శంకరి, డీపీవో శ్రీనివాస్ విశ్వనాథ్, డీఈవో ఎస్.అబ్రహం, ఐసీడీఎస్ పీడీ పద్మావతి, డీఎల్‌పీవోలు, ఈవోపీఆర్డీ, తహసీల్దార్లు పాల్గొన్నారు.

నేడు పింఛన్ పండుగ

- ఉదయం 6గంటలకే పంపిణీ ప్రారంభం
- జిల్లాలో 2.66 మంది లక్షల లబ్ధిదారులకు రూ. 113.99 కోట్లు పంపిణీకి ఏర్పాట్లు
- తొలిరోజే నూరు శాతం

పింఛన్‌ల పంపిణీకి చర్యలు : కలెక్టర్

ఏలూరు సిటీ, జూన్ 31 : గత నెలలో మాదిరిగానే ఆగస్టులోను పింఛన్‌లను ఇంటింటికీ పంపిణీ చేయడానికి జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. తొలిరోజునే నూరుశాతం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 2 లక్షల 66 వేల 867 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను రూ.113.99 కోట్లు పంపిణీ చేయనున్నట్టు కలెక్టర్ కె.వెట్రి సెల్వి వెల్లడించారు. ఉదయం ఆరు గంటల నుంచి పంపిణీ ప్రారంభం అవుతుందని, గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది పెన్షన్‌దారుల ఇళ్లకు వెళ్లి అందజేస్తారన్నారు. ఒకటో తేదీనే నూరుశాతం పింఛన్‌లు పంపిణీ చేయడానికి 5,187 మంది సచివాలయ, ఇతర ప్రభుత్వ సిబ్బందిని నియమించామన్నారు. అనివార్య కారణాలతో పింఛన్ తీసుకోని వారికి 2న అందిస్తామన్నారు.

పింఛన్‌ల వివరాలు

పింఛన్ రకం	లబ్ధిదారులు	పింఛన్ మొత్తం
అభయహస్తం	4,741	23,70,500
అమరావతి లాండ్‌లెస్‌పూర్	10	50,000
డప్పుకళాకారులు	2,080	83,20,000
విభిన్నప్రతిభావంతులు	33,780	20,26,80,000
మత్స్యకారులు	6,297	2,51,88,000
కళాకారుల పెన్షన్	172	6,88,000
వృద్ధాప్య	1,33,289	53,31,56,000
సైనిక్‌వెల్ఫేర్	18	90,000
సింగిల్ ఉమెన్	8,336	3,33,44,000
కల్లుగీత కార్మికులు	4,604	1,84,16,000
చర్మకారులు	1,699	67,96,000
ట్రాన్స్‌జెండర్	73	2,92,000
నేత కార్మికులు	1,138	45,52,000
వితంతు	68,153	27,26,12,000
సీకేడీయూ (ప్రభుత్వ)	182	18,20,000
సీకేడీయూ (ప్రైవేటు)	264	26,40,000
డీఎంహెచ్‌వో	3,131	2,62,51,000
మొత్తం	2,66,867	1,13,99,31,500

ఏలూరులో మరో వేసవి

- పెరిగిన ఎండలు.. ఆపై వేడిగాలులు

ఏలూరు రూరల్, జూలై 31 : రాష్ట్రంలో అత్యధిక ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తూ కొన్నిచోట్ల వరదలు ముంచెత్తుతున్నా ఏలూరులో అందుకు భిన్నమైన వాతావరణం నెలకొంది. ఎండ తీవ్రత రెండురోజులుగా పెరిగి వేసవిని తలపిస్తోంది. సాధారణంగా ఉండాల్సిన దానికన్నా అధిక ఉష్ణోగ్రతలు ఉంటున్నాయి. రెండురోజుల వ్యవధిలో 34 డిగ్రీలు గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సాధారణంగా ఈ సీజన్‌లో తరచూ జల్లులుపడుతూ వాతావరణం చల్లగా ఉంటుంది. అయితే వానజాడ లేకపోగా ఎండ తీవ్రత పెరిగి విపరీతమైన ఉక్కబోత ఉంటోంది.

పెరిగిన రొయ్యల ధరలు

- వంద కౌంట్ కేజీ రూ.240.. ఉత్పత్తి లేక ఆక్వా రైతుల డీలా



ముదినేపల్లి, జూలై 31 : మార్కెట్‌లో రెండు రోజులుగా రొయ్యల ధరలు కాస్తా పెరిగి ఆశాజనకంగా ఉన్నాయి. అయితే రొయ్యల ఉత్పత్తులు తగ్గిన సమయంలో ధరలు ఉన్నట్టుండి పెరగడంతో ఆక్వా రైతులకు పెద్దగా ఊరట కలిగించలేదు. వంద కౌంట్ రొయ్యలు కేజీ ఒక్కంటికి రూ.240, 80 కౌంట్ రూ.260, 60 కౌంట్ రూ.300, 50 కౌంట్ రొయ్య ధర రూ.320కి పెరిగింది. నెల రోజులుగా మార్కెట్‌లోని మాంద్యం వల్ల ఉత్పత్తులు ఉన్నా ధర లేక రైతులు నష్టపోయారు. ఎక్కువగా మార్కె టింగ్ జరిగే వంద కౌంట్ రొయ్య ధర నాలుగు రోజుల క్రితం వరకు కేజీ రూ.200 ఉండగా, బుధవారం ఈ ధర రూ.240కి పెరిగింది. భీమవరం, నరసాపురం, గణప వరం తదితర ప్రాంతాల నుంచి ఏజెంట్లు రొయ్యల కోసం ముదినేపల్లి ప్రాంతంలో ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం 200 కౌంట్ స్థాయిలో రొయ్యలు ఉండడంతో అమ్మ కాలు జరగడం లేదు. పట్టుబడులూ పెద్దగా లేవు. దీంతో ధరలు ఆక్వా రైతులకు గిట్టుబాటు కలిగించే విధంగా ఉన్నా రొయ్యల ఉత్పత్తి లేక ఫలితం లేకుండా పోయింది.

పర్మిషన్ ఒకచోట.. పాఠశాల మరోచోట!

జేసీకి ఎస్ఎఫ్ఐ ఫిర్యాదు

ఏలూరు అర్బన్, జూలై 31 : నగరంలో ఒక భవనం చిరునామాపై ప్రభుత్వ అనుమతులు తీసుకుని అదనంగా మరిన్ని చిరునామాలు, భవనాల్లో పాఠశాలలు నిర్వహిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్ ఆధ్వర్యంలోని విద్యార్థి నాయకుల బృందం బుధవారం జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేసింది. వివరాలను లెనిన్ పత్రికలకు తెలిపారు. ఏలూరులో అనేక ప్రైవేటు విద్యా సంస్థలను ప్రభుత్వ అనుమతి లేకుండా నడుపుతున్నారని, ఆర్ఆర్ పేటలోని ఓ పాఠశాల యాజమాన్యం ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్టు తాముచేసిన ఫిర్యాదుపై ఎంఈవో విచారణకు వెళ్లగా రుజువైందని, అయినప్పటికీ డీఈవో ఎటువంటి చర్యలు తీసుకోలేదని జేసీకి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల పరిసర ప్రాంతాల్లో విద్యాసంస్థలకు అనుమతులు ఇవ్వరాదని, దీనికి విరుద్ధంగా పలు ప్రైవేటు పాఠశాలలు నడుస్తున్నాయని ఆరోపించారు. ప్రాథమిక తరగతులకు ప్రభుత్వ అనుమతులు తీసుకుని, హైస్కూలు తరగతులను వేరేచోట భవనాల్లో నిర్వహిస్తున్నారని వివరించారు. సంఘ నగరశాఖ అధ్యక్షుడు మనోజ్, కమిటీ సభ్యుడు జయంత్ తదితరులు పాల్గొన్నారు.

తక్షణ చర్యలు చేపట్టాం : డీఈవో

ఎస్ఎఫ్ఐ నాయకులు ఫిర్యాదు చేసిన ఏలూరు ఆర్ఆర్ పేట అక్షర పాఠశాల మూడు స్కూళ్లను నిర్వహించడంతో పాటు, అనధికారికంగా 8, 9 తరగతులను నిర్వహిస్తున్నట్టుగా తమ దృష్టికి వచ్చిన వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్టు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో వివరణ ఇచ్చారు. వీటన్నింటినీ మూసి వేయించామని, అవసరమైతే తనిఖీలు చేసుకోవచ్చని వివరించారు.

వరద సాయంలో కక్కుర్తి



- బాధితులకు పంచాల్సిన ఉల్లిగడ్డలు, బంగాళదుంపలు అక్రమ తరలింపు
- అడ్డుకుని అధికారులకు అప్పగించిన జనసేన నాయకులు
- లెక్కలు తేల్చాలని డిమాండ్

వేలేరుపాడు, జూలై 31 : గోదావరి వరదల కారణంగా ఇబ్బందులు పడుతున్న బాధితులకు అందించాల్సిన ఉల్లిగడ్డలు, బంగాళా దుంపలు అక్రమ మార్గం పట్టాయి. ఐదు రకా ల కూరగాయలు కిలో చొప్పున ఒక్కొక్క బాధి త కుటుంబానికి ఐదు కిలోలు పంపిణీ చేయా ల్సి ఉండగా అరకొర పంపిణీ చేసి మిగుల్చుకున్న నాలుగు టన్నుల ఉల్లిగడ్డలు, బంగాళా దుంపల బస్తాలను ఒక వ్యాన్‌లో తరలిస్తుం డగా జనసేన నాయకులు ఆదినారాయణ, సుధాకర్, క్రాంతికుమార్, ములకలపల్లి నర సింహారావు తదితరులు పదిహేను కిలోమీటర్లు వెంబడించి మేడేపల్లి వద్ద అడ్డగించారు. డ్రైవర్ ను ప్రశ్నించగా చింతలపూడి తరలిస్తున్నట్టు తెలిపాడు. సివిల్ సప్లై డీటీ అక్కడికి వచ్చి మేడేపల్లిలో పంపిణీ చేసేందుకు తెప్పించామని పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. ఇప్పటికే మేడే పల్లిలో కూరగాయల పంపిణీ పూర్తయ్యిందని, డ్రైవర్ వాటిని చింతలపూడి తరలిస్తున్నామని చెబుతున్నాడని డీటీని నిలదీ శారు. వ్యాన్‌ను వేలేరుపాడులోని తహసీల్దార్ కార్యాలయానికి తీసుకొచ్చి అధికారులకు స్వాధీ నం చేశారు. అక్రమ తరలింపుపై కేసు నమో దు చేసి వ్యాన్ లో ఉన్న బంగాళా దుంపలు, ఉల్లిగడ్డలు స్వాధీ నం చేసుకుంటామని డిప్యూ టీ తహసీల్దార్ రమేష్ తెలిపారు. ఇవే కాకుం డా నూనె ప్యాకె ట్లు, కందిపప్పు ఇతర కూర గాయలను సివిల్ సప్లై అధికారులు దొంగ చాటుగా తరలించారని జనసేన నాయకులు ఆరోపిస్తున్నారు. మండలానికి వచ్చిన సరుకులెంతా.. పంచింది ఎంత.. అనే లెక్కలు బయట పెట్టాలని జనసేన మండల అధ్యక్షుడు గణేషుల ఆదినారాయణ డిమాండ్ చేశారు.



కుక్కునూరులోని గుండేటి వాగు తీరంలో నిలకడగా ఉన్న గోదావరి

మళ్లీ పెరిగిన గోదావరి

పోలవరం/వేలేరుపాడు/కుక్కునూరు, జూలై 31 : గోదావరి శాంతించింది. రెండు రోజుల నుంచే తగ్గుముఖం పట్టిన గోదావరి బుధవారం మరింతగా తగ్గింది. భద్రాచలం వద్ద బుధవారం ఉదయం ఏడు గంటలకు 44.8 అడుగులకు నీటిమట్టం నమోదైనప్పటికీ సాయంత్రానికి 45 అడుగులకు చేరి మళ్లీ 44.90 అడుగులకు తగ్గింది. మొదటి ప్రమాద హెచ్చరిక అమలులో ఉంది. పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నీటిమట్టం స్వల్పంగా పెరిగి 23.257 మీటర్లకు చేరుకోగా 9,91,282 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేశారు. వరద జలాలను 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. స్పిల్‌వే ఎగువన 32.630 మీటర్లు, దిగువన 24.220 మీటర్లు నమోదైంది. ఎల్ఎన్‌డీ పేట, కొవ్వాడ కాల్వ రిజర్వాయర్ వద్ద 89.10 మీటర్ల నీటిమట్టం నమోదు కాగా 20 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేశారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 21 పంపులు 21 మోటార్లతో 7,434 క్యూసెక్కుల గోదావరి వరద జలాలు దిగువకు విడుదల చేశారు. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద జలాలు ఆక్రమించాయి. మరోవైపు ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 14.30 మీటర్లుకు చేరుకోగా, 10,40,000 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేశారు. మొదటి ప్రమాద హెచ్చరిక అమల్లో ఉంది. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో గోదావరి వరద నిలకడగా ఉంది. వేలేరుపాడు మండలంలో ముంపు బారిన పడిన 30 గ్రామాలు కాస్తా కోలుకుంటున్నాయి. పునరావాస కేంద్రాల్లోనే బాధితులు తలదాచుకుంటున్నారు. కుక్కునూరు మండలంలోను ఇదే పరిస్థితి ఉంది. గోదావరి వరద తగ్గుతూ పెరుగుతూ దోబూచులాడుతుండడంతో ఈ రెండు మండల ప్రజలకు కంటి మీద కునుకు ఉండడం లేదు.

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరు సిటీ : జిల్లాలో వర్షాలు కొనసాగుతూనే ఉన్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం వర్షాలు కురిశాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా భీమడోలులో 32.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 6.1 మి.మీగా నమోదైంది. కుక్కునూరు 30, వేలేరుపాడు 21.6, పెదపాడు 17.4, ఆగిరిపల్లి 14.6, దెందులూరు 12.4, కలిదిండి 6.8, ముదినేపల్లి 6.4, కైకలూరు 6.2, ఉంగుటూరు 5.4, ఏలూరు రూరల్ 5.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

పరిహాసం..

వాస్తవ బాధితులకు అందని పరిహారం.. పెద్దల సిఫార్సుతో అనర్హులకు అందజేత.. అధికారులను నిలదీసిన బాధితులు

వేలేరుపాడు, జూలై 31 : మండలంలోని వరద ముంపు గ్రామాలకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయం రూ.3 వేలు పంపిణీ పరిహాసంగా మారింది. అధికారులు ఒక్కో గ్రామంలో ఒక్కోరీతిగా వ్యవ హరిస్తూ అనుకూలమైన వారికి పరిహారాన్ని పంపిణీ చేస్తున్నారన్నారు. గోదావరి వరద దరిదాపుల్లో కూడా రాని గ్రామాల్లో అందరికి పరిహారం చెల్లించి వాస్తవంగా వరద కారణంగా గృహాలు మునిగిపోయిన వారికి మొండిచెయ్యి చూపిస్తున్నారు. ఇందుకు ఉదాహరణగా వేలేరుపాడులో అధికారులు ఇష్టానురీతిగా వ్యవహరిస్తూ కొందరు పలుకుబడి కలిగిన వారిచ్చిన లిస్టు ఆధారంగా పంపిణీ చేపట్టడంతో బాధితుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. బుధవారం సాయంత్రం వేలేరుపాడు సంత మార్కెట్ సెంటర్, రజక బజార్, ఎస్టీ కాలనీలకు సంబంధించి 83 కుటుంబాలకు రూ.3 వేలు సహాయాన్ని అందించే కార్యక్రమం చేపట్టారు. అధికారులు రూపొందించిన జాబితాలోని కొందరి పేర్లు తీసేసి అనధికారికంగా కొంద రు ఇచ్చిన జాబితా ప్రకారం పరిహారాన్ని పంపిణీ చేయడంతో బాధితు లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి, తమకు జరిగిన అన్యాయంపై అధికారు లను నిలదీయడంతో పంపిణీని నిలిపివేశారు. ఎక్కడెక్కడో ఉంటున్న వారికి పరిహారం ఇచ్చి వాస్తవంగా నష్టపోయిన తమకు పరిహారం కోత విధించడంతో తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని అధికారుల తీరుపై మండిపడ్డారు. మరలా మరోసారి సర్వే చేసి పరిహారం పంపిణీ చేస్తా మని డీటీ రమేష్ బాధితులకు తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన 83 కుటుంబాలకు చెందిన జాబితాలో సంబంధంలేని 60 కుటుంబాలకు పరిహారం చెల్లించారు. పరిహారం పంపిణీలో జరిగిన అవకతవకలపై కలెక్టర్ విచారణ జరిపించి అధికారులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

నిందితులను త్వరితగతిన అరెస్టు చేయాలి : ఐజీ



సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

ఏలూరు క్రైం, జూలై 31 : మహిళలకు సంబంధించిన కేసులు, సైబర్ కేసులు, గంజాయి అక్రమ రవాణా, పోక్సో యాక్టు కేసులపై పోలీసు అధికారులు ప్రత్యేక శ్రద్ధను కనబర్చి నిందితులను త్వరితగతిన అరెస్టు చేయాలని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. జిల్లా నేరసమీక్షా సమావేశం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కేపీఎస్ కిషోర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఐజీ మాట్లాడుతూ.. 'కేసులు స్పీడ్ ట్రయల్ నిర్వహించే విధంగా నిందితులకు శిక్షలు పడేలా సాక్షులను సకాలంలో కోర్టులకు హాజరుపర్చాలి. మైనర్ బాలికల విషయంలో జాగ్రత్త వహిస్తూ ఉన్నతాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. కేసులను త్వరితగతిన దర్యాప్తు చేపట్టి నిందితులను త్వరితగతిన అరెస్టు చేయాలి' అని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ గత ఆరు నెలల నుంచి జిల్లాలో నమోదైన కేసుల వివరాలు తెలుసుకుని తగిన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి సోమవారం పబ్లిక్ గ్రీవెన్సులో వచ్చే ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టాలన్నారు. ఏఎస్పీ జి.స్వరూపరాణి, ఎస్ఈబీ ఏఎస్పీ సూర్యచంద్రరావు, ఏఆర్ ఏఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న అధికారులు

జిల్లాలో ముగ్గురు డీఎస్పీల బదిలీ

- ఏలూరు డీఎస్పీగా శ్రావణ్‌కుమార్



శ్రావణ్‌కుమార్

ఏలూరు క్రైం, జూలై 31 : ఏలూరు డీఎస్పీగా శ్రావణ్‌కుమార్‌ను నియమితుల య్యారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 96 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు డిస్ట్రిక్ట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో పనిచేస్తున్న డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్‌ను ఏలూరు డీఎస్పీగా నియమించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న ఏలూరు డీఎస్పీ ఈ శ్రీనివాసులను పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. నూజివీడు డీఎస్పీగా పనిచేస్తున్న జి.లక్ష్మయ్యను సీఐడీ విభాగానికి బదిలీ చేశారు. ఏలూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా పనిచేస్తున్న ఆర్.రామాంజనాయక్‌ను ఆత్మకూరు డీఎస్పీగా నియమించారు.

ఇంకనూ..తొలగలేదేమి ?



ఆకివీడు నగర పంచాయతీ ఛైర్మన్ గదిలో మాజీ సీఎం జగన్ ఫొటో ఇంకా తొలగలేదు. ప్రభుత్వం మారడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో జగన్ ఫొటోలు తొలగించి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ఫొటోలు పెట్టాలని ఆదేశాలు వచ్చాయి. అధికారులు అదేవిధంగా ఏర్పాటు చేశారు. కానీ నగర పంచాయతీ కార్యాలయ వైసీపీ ఛైర్మన్ జామీ హైమావతి గదిలో గోడకు ఉన్న జగన్ ఫొటో మాత్రం ఇంకా తొలగించలేదు. ప్రభుత్వానికి వైసీపీ నేతలు విలువ ఇవ్వడం లేదని కూటమి శ్రేణులు మండిపడుతున్నారు. **- ఆకివీడు**

మా భార్యలను కాపురాలకు పంపండి ?



ఇదో రివర్స్ సెంటిమెంట్.. కూతుళ్లను కాపురాలకు తీసుకు వెళ్లాలని మామ అల్లుళ్లను కోరడం చూశాం. కాని ఏలూరులో కూతుళ్లను కాపురానికి పంపించక పోవడంతో మామపై కోపంతో ఇద్దరు అల్లుళ్ల కలెక్టరేట్ వద్ద నిరసనకు దిగారు. వివరాల్లోకి వెళితే విజయవాడలో నివాసం ఉంటున్న శేషసాయి ఏలూరుకు చెందిన బూరగడ్డ శ్రీనివాస రామానుజ అయ్యంగార్ మొదటి కూతురును వివాహం చేసుకున్నాడు. ఉద్యోగరీత్యా గుజరాత్‌లో ఉంటున్న పవన్ అయ్యంగార్ రెండో కుమార్తెను ఇటీవల వివాహం చేసుకున్నాడు. అయితే తమ భార్యలను కాపురానికి పంపకుండా కూతుళ్లను ఇంటివద్దనే ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అళ్లల్లిద్దరూ వాపోతున్నారు. కాపురానికి పంపమని పదేపదే బతిమిలాడుతున్నా తిరిగి తమపై వేధింపుల కేసులు పెట్టాడని ఆందోళన వ్యక్తం చేశారు. అయ్యంగారికి ఉన్న పలుకుబడితో తమ భార్యలతో తమపైనా, కుటుంబ సభ్యులపైనా కేసులు పెట్టించి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా తమ భార్యలను కాపురానికి పంపించాలని మామపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

-ఏలూరు రూరల్

పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు పూర్తిచెయ్యండి

పార్లమెంట్‌లో ఎంపీ మహేష్



రాష్ట్రంలో పెండింగులో ఉన్న రైల్వే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. బుధవారం ఎంపీ మహేష్ పార్లమెంట్‌లో మాట్లాడుతూ బడ్జెట్‌లో రైల్వే మౌలిక సదుపాయాల కోసం రూ.9151 కోట్లు కేటాయించటం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ తరఫున ధన్యవాదాలు తెలిపారు. గత ఏడాది కేటాయించిన బడ్జెట్ కంటే 8.65 శాతం ఎక్కువని హర్షం వ్యక్తం చేశారు. వందేభారత్ రైళ్లను ఏలూరు స్టేషన్‌లో ఆపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కోటిపల్లి-నర్సాపూర్ రైల్వేలైన్, విజయవాడ- గూడూరు, గుడివాడ - నూజివీడు, భద్రాచలం - కొవ్వూరు రైల్వే మార్గాలను త్వరిత గతిన పూర్తిచేయాలని కోరారు. రైల్వేస్టేషన్‌ను ఆధునీకరించి ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపరచాలని కోరారు. ఏలూరు రైల్వేస్టేషన్‌ను అమృత్ స్టేషన్ల పథకంలో చేర్చడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. వృద్ధులు మహిళలు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

-ఏలూరు టూటౌన్

12 అడుగుల కొండచిలువ హతం



పోలవరం మండలం పట్టిసీమలో గ్రామస్థుల చేతిలో కొండచిలువ హతమైంది. ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి వరద జలాలలో కొట్టుకు వచ్చిన కొండచిలువ పట్టిసీమ రివర్ ఇన్ అతిథి గృహం ఆవరణలో సంచరిస్తుండడంతో భయ భ్రాంతులకు గురైన స్థానికులు కేకలు వేశారు. అక్కడ ఉన్న యువకులు దానిని కర్రలతో కొట్టి చంపారు. హతమైన కొండచిలువ 12 అడుగులు ఉందని తెలిపారు.

- పోలవరం

నరసాపురం లేసు పార్కులో ఎన్నికల కోలాహలం

ప్రస్తుత పాలకమండలి రద్దు చేస్తూ ఉత్తర్వులు

పార్క్ పరిధిలోని 51 సొసైటీలకు ఎన్నికలు



నరసాపురం రూరల్, జూలై 31: నరసాపురం లేసు పార్కు సొసైటీ ఎన్నికలకు నగారా మోగింది. ప్రస్తుత పాలక మండలిని రద్దు చేస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 23న ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. లేసు పార్కు పాలక మండలితో పాటు పరిధిలోని 51 సొసైటీలకు ఎన్నికలు నిర్వహించి కొత్త పాలక మండలిని ఎన్నుకోవాలని ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో లేసు పార్కులో ఎన్నికల కోలాహలం నెలకొంది. నరసాపురం లేసు పార్కు పరిధిలో నర సాపురం, మొగల్తూరు, యలమంచిలి, పోడూరు, పాలకొల్లు, వీరవాసరం మండ లాలు ఉన్నాయి. ఈ ఆరు మండలాల్లో 51 సొసైటీలు ఉండగా పది వేల మంది సభ్యులు ఉన్నారు. లేస్ పార్కు బైలా ప్రకారం ముందుగా 51 సొసైటీలకు ఎన్ని కలు నిర్వహిస్తారు. ఎన్నికైన 51 మందితో తిరిగి తొమ్మిది మందిని లేసు పార్కు సొసైటీ పాలకమండలి సభ్యులుగా ఎన్నుకుంటారు. వీరిలో అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కోశాధికారి, ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు ఉంటారు. ఈనెల 23న 51 సొసైటీలకు ఎన్నికలు నిర్వహించి మధ్యాహ్నం లేసుపార్కు పాలక మండలి సభ్యుల ఎన్నికలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ విషయాన్ని పార్కు పరిధిలోని అన్ని సైటీల్లోని సభ్యులకు తెలి యజేసినట్టు లేసు పార్కు ప్రాజెక్టు మేనేజర్ కుసుమకుమారి తెలిపారు.

కల్తీ పెట్రోలు, డీజిల్ విక్రయాలు..కేసు నమోదు

భీమడోలు, జూలై 31 : అనుమతులు లేకుండా డీజిల్, పెట్రోల్ అమ్ముతూ అందులో సాల్వెంట్ ఆయిల్ కలిపి కల్తీ చేసి అమ్మకాలు కొనసాగిస్తున్న బృందాన్ని అరెస్టు చేసినట్లు భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. కాకినాడ జిల్లా శంకవరం మండలం కత్తిపూడి గ్రామానికి చెందిన తోట తాతబ్బాయిరాజు, తోట చంటిబాబు, దూడల వెంకటరమణ, శ్రీరాములు అనే వ్యక్తులు గత కొంతకాలంగా ఎటువంటి డీజిల్, పెట్రోల్‌ను కల్తీ చేసి విక్రయిస్తున్నట్టు అందిన సమచారం మేరకు బుధవారం కురేళ్ళగూడెం హైవేలో వీరిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. 210 లీటర్ల కల్తీ ఆయిల్‌ను, ఆటోను స్వాధీనపర్చుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చొరబడిన దొంగలు

భీమవరం క్రైం, జూలై 31 : తాళం వేసి ఊరు వెళ్లిన ఒక ఒక ఇంట్లో దొంగలు చొరబడ్డారు. భీమవరం హౌసింగ్ బోర్డులో నివాసం ఉండే నాచు శేషగిరిరావు కుటుంబం గతనెల 8వ తేదీన బెంగుళూరులో ఆసుపత్రికి వెళ్లారు. అయితే రోజూ పని మనిషి వచ్చి ఇంటి బయట శుభ్రం చేసి వెళ్తుంది. రోజులాగానే బుధవారం కూడా వచ్చేసరికి ఇంటి తాళాలు బద్దలు కొట్టి ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో శేషగిరిరావు బంధువు నల్లం లోకనాథరావుకి తెలియజేసింది. ఆయన వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ దేవరాజు తెలిపారు.

నిధుల్లేవ్.. విధుల్లేవ్..



వైసీపీ పాలనలో ఉత్సవ విగ్రహాలుగా ఎంపీటీసీలు

మూడేళ్లు గడుస్తున్నా చిల్లిగవ్వ రాలేదు..

టీడీపీతోనే న్యాయం అంటున్న ప్రజాప్రతినిధులు

ఏలూరు రూరల్, జూలై 31: గ్రామీణ ప్రజలకు ప్రజాసేవ చేయాలన్న కోరికతో పదవులు చేపట్టిన ప్రజా ప్రతినిధులకు వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర నిరాశే మిగిలింది. ఎన్నికై మూడేళ్లు కావస్తున్నా తమ ప్రాంతాలను అభివృద్ధి చేసుకునేందుకు నిధులు ఇవ్వకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కనీసం ప్రభుత్వ కార్యాలయాల్లో గౌరవమైనా దక్కుతుందా అనుకుంటే అది కూడా లేదు. 2021 ఏప్రిల్ 8న ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో జిల్లాలోని 1045 ఎంపీటీసీ స్థానాల్లో వైసీపీ కైవశం చేసుకుంది.

మూడేళ్లు గడిచినా ..

ఎంపీటీసీలుగా గెలిచి మూడేళ్లు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన ఏ హామీ నెరవేర్చలేదని ఎంపీటీసీలు లోలోపల మదన పడుతున్నారు. ప్రత్యేకంగా నిధులు లేవు.. విధులు లేవు. గ్రామ పంచాయతీలో కనీసం ఎంపీటీసీలకు ప్రత్యేకంగా కుర్చీలు కూడా లేకుండా పోయాయి. గ్రామాల్లో చిన్నచిన్న పనులు కూడా చేయలేని పరిస్థితి నెలకొనడంపై ఎంపీటీసీలు ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. పదవీకాలం ఇప్పటికే మూడేళ్లు గడిచిపోయింది. మండలపరిషత్‌కు గతంలో బీఆర్‌జీఎఫ్ తలసరి గ్రాంటు, ఆర్థికసంఘం నిధులు వచ్చేవి. దీంతో గ్రామాల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు అంతర్గత రోడ్లు చేపట్టేవారు. ప్రస్తుతం ఆ నిధులన్నీ ఎంపీటీసీల ప్రమేయం లేకుండా నేరుగా పంచాయతీలకు ఇవ్వడంతో వారికి గౌరవం కూడా లేకుండా పోయింది. 15వ ఆర్థికసంఘం నిధుల నుంచి 20 శాతం ఎంపీ టీసీలకు ఇవ్వాల్సిందిగా కేంద్రం సూచించినా అప్పటి వైసీపీ ప్రభుత్వం ఇవ్వలేదు. ఎంపీటీసీలకు నిధుల వాటా 25 శాతం పెంచాలన్న విజ్ఞప్తిని పట్టించుకోలేదు. ప్రత్యేక నిధులు కేటాయిస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటన చేసినప్పటికి అది కార్యాచరణ దాల్చలేదు. ఎంపీటీసీ పదవి ఉన్నా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోతున్నామని ఎంపీటీసీలు వాపోతున్నారు.

నిధుల కోసం వినతులు

తమ హామీలను నిలబెట్టుకుని ప్రజల్లో గౌరవం పొందాలనుకున్న ఎంపీటీసీలకు అడుగడుగునా నిరాశ ఎదురైంది. నిధులు మంజూరు కోసం వినతులు ఇస్తున్నా స్పందన లేదు. వైసీపీ హయాంలో మండల పరిషత్‌కు పెద్దగా నిధులు మంజూరు కాలేదు. సాధారణ నిధులు కూడా అంతంత మాత్రంగా ఉండటంతో వారు ఏ పనీ చేయలేకపోయారు. గత ప్రభుత్వంలో ఎంపీటీసీలకు ఒక్క పైసా కూడా విదల్చలేదు

టీడీపీతోనే న్యాయం

స్థానిక సంస్థలను బలోపేతం చేసిన ఘనత టీడీపీదే. స్థానిక ప్రజా ప్రతినిధులకు అవసరమైన నిధులు కేటాయించిన ఘనత చంద్రబాబుదే. వైసీపీ ప్రభుత్వ హయాంలో గెలిచిన ప్రజాప్రతినిధులు అప్పుల పాలు అవ్వడంతో పాటు వారిచుట్టూ ఉన్న ప్రజలకు చెప్పుకోవడానికి ఒక్క పని కూడా చేసిన దాఖలాలు లేకుండా పోయాయి. తీవ్ర నిరాశకు గురైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ గ్రామాలను అభివృద్ధి చేసుకోవడానికి టీడీపీతోనే న్యాయం జరుగుతుందని భావిస్తున్నారు. తమ ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవడానికి సిద్ధపడుతున్నారు.

- కడలి గోపాలరావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు

ఏది నిజం..?



నరసాపురంలో సంచలనం రేకెత్తించిన తాకట్టు బంగారం కేసులో ఎన్నో కొత్త కోణాలు వెలుగు చూస్తున్నాయి. ఉషారాణి తాకట్టు పెట్టింది..అసలైన బంగారమా.. ? లేదా నకిలీదా..? వ్యాపారి వాటిని మార్చాడా..? లేదా ఇంకా ఏమైనా కొత్త ట్విస్ట్‌లు ఉన్నాయా? ఈ కేసులో ఇలా అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి...

బంగారమే తాకట్టు పెట్టా : ఉషారాణి

కాదు.. నకిలీ బంగారం అంటున్న జైన్

మోసం చేశారంటూ పరస్పర కేసులు

అన్ని కోణాల్లో పోలీసులు విచారణ



నరసాపురంలోని తాకట్టు నగల దుకాణం

నరసాపురం, జూలై 31: నకిలీ బంగారం కేసు పోలీసులకు ఛాలెంజ్‌గా మారింది. ఇద్దరి ఫిర్యాదుల్ని స్వీకరించిన పోలీసులు ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో రోజుకో ట్విస్ట్ వెలుగు చూస్తోంది. నకిలీ బంగారం తాకట్టు పెట్టి మోసం చేసిందని జేపీ బ్యాంకర్స్ అధినేత సుమేరామాల్ జైన్ ఆరోపిస్తుంటే తాను పెట్టింది అసలు బంగారమే అని వాటిని మార్చేసి తిరిగి చంపుతామని తమనే బెదిరిస్తున్నారంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉషారాణి నెల్లూరులో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాకట్టు వ్యాపారులు కస్టమర్లకు పెట్టిన వస్తువులకు రసీదులు ఇవ్వరన్న విషయం ఈ కేసుతో వెల్లడైంది. ఒక్క ఉషారాణి విషయంలో కాదు.. ఎవరూ పెట్టినా ఇదే పరిస్థితి. దీనివల్ల కస్టమర్లు కొన్ని సమయాల్లో మోసపోయే ప్రమాదం ఉంది. ఉషారాణి విషయంలో ఇదే జరిగింది. గడిచిన రెండేళ్లలో ఆమె దాదాపు 22 సార్లు వస్తువుల్ని తాకట్టు పెట్టింది. దీనికి ఎటువంటి రసీదు ఇవ్వలేదు. అయితే ఉషారాణి తాకట్టు పెట్టినప్పుడల్లా వస్తువుల బరువు చూసి తాకట్టు ఫారంలో ఆ వివరాలను నమోదు చేసి సంతకం కూడా పెట్టించారు. అయితే వస్తువుల్ని గీటు పెట్టకుండా అప్పు ఇవ్వడమే పెద్ద మిస్టరీగా మారింది. ఉషారాణి స్వస్థలం నరసాపురం అయి నప్పటికీ ఆమె కొంత కాలం నుంచి నెల్లూరులో ఉంటున్నారు.రాష్ట్రంలో నెల్లూరు బులియన్ వ్యాపారానికి పెట్టింది పేరు. అక్కడ తాకట్టు వ్యాపారాలు కూడా ఉన్నాయి. అక్కడ కాకుండా ప్రతిసారి నరసాపురంలోనే ఎందుకు తాకట్టు పెట్టారన్న సందేహం కూడా వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఉషారాణి కుటుంబ నేపథ్యం..ఆమెకు ఈ బంగారం పూర్వీకుల నుంచి వచ్చిందా ? లేదా కొన్నదా.. ? ఇతర ఆస్తిపస్తులు, తాకట్టు పెట్టినప్పుడల్లా వచ్చిన డబ్బును ఏం చేశారు ? ఏమైనా ఆస్తులు కొన్నారా ? తదితర కోణాల్లో పోలీసులు లోతైన విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఈ కేసు దర్యాప్తును పోలీసులు ఛాలెంజ్‌గా తీసుకున్నారు. దుకాణంలోని సీసీ కెమెరాల ఫుటేజ్, తాకట్టు పెట్టినట్లు వ్యాపారి చూపిస్తున్న వస్తువుల్ని కూడా పరిశీలించారు. అన్ని స్టేట్‌మెంట్‌లు, కేసుకు సంబంధించిన అన్ని ప్రూఫ్‌లను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. ఇందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సీఐ స్వామి చెప్పారు.

ఈపీడీసీఎల్‌లో పదోన్నతులు, బదిలీలు

విశాఖ సర్కిల్ ఎస్ఈగా జి.శ్యామ్‌బాబు

రాజమండ్రి ఎస్ఈగా గొర్లె ప్రసాద్

విశాఖపట్నం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్)లో పలువురికి బుధవారం పదోన్నతులు కల్పించారు. మరికొందరిని బదిలీ చేశారు. ఈపీడీసీఎల్ పరిధి శ్రీకాకుళం జిల్లా నుంచి ఏలూరు వరకు ఉండడంతో అన్నింటిని దృష్టిలో ఉంచుకొని సీఎండీ పృథ్వీతేజ్ ఈ బదిలీలు చేశారు. విశాఖపట్నం కార్పొరేట్ ఆఫీసులో జీఎం (ఆపరేషన్స్-2)గా పనిచేస్తున్న జి.శ్యాంబాబును విశాఖ సర్కిల్ ఆపరేషన్స్ ఎస్ఈగా నియమించారు. కాకినాడలో ఆపరేషన్స్ ఈఈగా పనిచేస్తున్న గొర్లె ప్రసాద్‌కు పదోన్నతి కల్పించి రాజమహేంద్రవరం ఆపరేషన్స్ ఎస్ఈగా నియమించారు. అక్కడ ఎస్ఈగా పనిచేస్తున్న టీవీఎస్ఎన్ మూర్తికి పదోన్నతి కల్పించి కార్పొరేట్ కార్యాలయంలో ప్రాజెక్ట్ సీజీఎంగా వేశారు. విశాఖలో ప్రాజెక్ట్ జీఎంగా ఉన్న బి.అశోక్‌కుమార్‌కు సీజీఎంగా పదోన్నతి ఇచ్చి కార్పొరేటర్ కార్యాలయంలో వేశారు. పలాసలో ఆపరేషన్స్ ఈఈగా పనిచేస్తున్న గొప్పు ప్రసాద్‌కు పదోన్నతి కల్పించి విశాఖ కార్పొరేట్ ఆఫీసులో ఆపరేషన్స్ జీఎంగా నియమించారు. తాడేపల్లిగూడెంలో ఈఈగా పనిచేస్తున్న ఎ.రఘునాథబాబుకు పదోన్నతి ఇచ్చి కార్పొరేట్ ఆఫీసులో ప్రాజెక్ట్ జీఎంగా వేశారు. పార్వతీపురంలోని ఈఈ వెంకటేశ్వరరావును కార్పొరేట్ కార్యాలయంలో ఎనర్జీ ఆడిట్‌కు, కార్పొరేట్ కార్యాలయంలో ఈఈ సురేశ్‌కుమార్‌ను శ్రీకాకుళం టెక్నికల్ ఈఈగా, రాజమహేంద్రవరం ఈఈ ఉదయ భాస్కర్‌ను కాకినాడ ఆపరేషన్స్ ఈఈగా, శ్రీకాకుళంలోని ఈఈ ఎ.రాజశేఖర్‌ను రాజమహేంద్రవరం ఈఈగా బదిలీ చేశారు. అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో డిప్యూటీ ఈఈ బి.రఘుకు పదోన్నతి కల్పించి తాడేపల్లిగూడెం వేశారు. విజయనగరం డిప్యూటీ ఈఈ పి.మురళీకృష్ణకు పదోన్నతి కల్పించి కార్పొరేట్ కార్యాలయంలో పర్చేజెస్ ఈఈగా బదిలీ చేశారు. శ్రీకాకుళంలోని డిప్యూటీ ఈఈ పి.యోగీశ్వరరావుకు పదోన్నతి ఇచ్చి ఆపరేషన్స్ ఈఈగా పలాస బదిలీ చేశారు. సింహాచలం డిప్యూటీ ఈఈ కె.గోపాలరావునాయుడికి పదోన్నతి కల్పించి పార్వతీపురం ఆపరేషన్స్ ఈఈగా బదిలీ చేశారు. వీరు కాకుండా మరికొందరు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు అసిస్టెంట్ ఇంజనీర్లుగా పదోన్నతి కల్పించి బదిలీలు చేశారు.

మొక్కజొన్న రైతులకు న్యాయం చేస్తాం

ఏలూరు జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా

పోలవరం / కొయ్యలగూడెం జూలై 31 : దళారీల చేతిలో మోసపోయిన రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని ఏలూరు జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా అన్నారు. బుధవారం పోలవరం పోలీస్‌స్టేషన్‌లో గత రబీ సీజన్‌లో మొక్కజొన్న, ధాన్యం మధ్యవర్తి ద్వారా విక్రయించామని సొమ్ములు అందక మోసపోయమని రైతులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విచారణకు వచ్చిన జిల్లా వ్యవసాయాధికారి ఎస్ఐ పవన్ కుమార్‌ని, మధ్యవర్తి పన్నూరి సూరిబాబుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉన్న తాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. మధ్యవర్తి ద్వారా 103 మంది రైతులకు ధాన్యం సొమ్ములు 79 లక్షలు, 33 మంది రైతులకు మొక్కజొన్న సొమ్ములు కోటి 23 లక్షల రూపాయలు ఇవ్వాల్సి ఉందన్నారు.ఇదేవిషయమై కొయ్యలగూడెంలో ధర్నా చేస్తున్న రైతులను కలిసి వివరాలు సేకరించామన్నారు. వ్యవసాయ సహాయ సంచాలకులు బుజ్జిబాబు, వ్యవసాయాధికారి కె.రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

పంట సొమ్ములు ఇప్పించండి...

పంటసొమ్ములు ఇప్పించాలని బుధ వారం పోలీసులను వ్యవసాయశాఖ అధి కారులను రైతులు కోరారు. సుమారు 2.50 లక్షల విలువైన మొక్కజొన్న పంట 120 క్వింటాళ్ళు మధ్యవర్తి ద్వారా దళారికి ఇచ్చామని ఇప్పటి వరకూ పంట సొమ్ములు రాక ఇబ్బందులకు గుర వుతున్నామని రైతు పన్నూరి నరసింహారావు ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు 7 లక్షల రూపాయల విలువ గల 4 వందల క్వింటాళ్ళ మొక్క జొన్న పంటను దళారులను నమ్మి ఇచ్చి మోసపోయినట్టు రైతు కరిబండి ప్రభాకర్ వాపోయాడు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా వెంటనే కొనుగోలు చేస్తే ఈ అవస్థలు ఉండేవి కావని ఆవేదన వ్యక్తం చేశాడు.



నరసింహారావు ,ప్రభాకర్



పోలవరం పోలీస్ స్టేషన్‌లో వివరాలు సేకరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

మోసగించిన దళారులను శిక్షించాలి

కొయ్యలగూడెం : రైతులను మోసం చేసిన దళారులను శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే ముడియం శ్రీనివాస్ అన్నారు. బుధవారం కొయ్యలగూడెం గొడౌన్ వద్ద ధర్నా చేస్తున్న రైతులకు మద్దతు తెలిపారు. దళారుల చేతిలో మోసపోయిన రైతులను రైతులకు న్యాయం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రైతులకు అండగా నిలిచారు. సీపీఎం కార్యదర్శి రాంబాబు ఆందోళనకు మద్దతు తెలిపారు.



ఉపాధ్యాయుడు శ్రీరామచంద్రమూర్తిని సత్కరిస్తున్న ఆంధ్రజ్యోతి తాడేపల్లిగూడెం బ్రాంచి మేనేజర్ హరిబాబు దంపతులు

గణిత ఉపాధ్యాయుడికి పదవీ విరమణ సత్కారం

ఉండ్రాజవరం, జూలై 31: ఉపాధ్యాయ వృత్తి ద్వారా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవచ్చని ఎంఈవో సక్సేనరాజు అన్నారు. మోర్త హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మద్దిపాటి శ్రీరామచంద్రమూర్తి బుధవారం స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. హైస్కూలులో జరిగిన అభినందన సభలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొని ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఎంఈవో సక్సేనరాజు, ఆంధ్రజ్యోతి తాడేపల్లిగూడెం బ్రాంచి మేనేజర్ బి.హరిబాబు దంపతులు శ్రీరామచంద్రమూర్తిని ఘనంగా సత్కరించారు. హెచ్ఎం కె.శ్రీనివాస్, హైస్కూలు ఉపాధ్యాయ సంఘ కార్యదర్శి ఎస్.తాతారెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాలు..

ఆరుగురి మృతి

దమ్ము ట్రాక్టర్ తిరగబడి ఒకరి మృతి



టి.నరసాపురం, జూలై 31: పొలంలో దమ్ము చేస్తుండగా అదుపుతప్పి ట్రాక్టర్ ఇంజన్ బోల్తా పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. టి.నరసాపురం మండలం బండివారిగూడెం గ్రామానికి చెందిన పోకల సుబ్బారావు (56) గంగినీడు పాలెంలో ఓ రైతుకు చెందిన వ్యవసాయ భూమిలో దమ్ము చేస్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. సుబ్బారావు ట్రాక్టర్ కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు.అతనిని చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుర్గా మహేశ్వరరావు తెలిపారు.

ధర్మాజీగూడెంలో చెరువులో పడి ఒకరు..

లింగపాలెం : లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన నక్కా దుర్గారావు (23) బుధవారం తెల్లవారుజామున ధర్మాజీ గూడెంలోని చెరువుకు బహిర్భూమికి అని వెళ్ళి ప్రమాదవశాస్తు కాలుజారి చెరువులో పడి చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఉదయం అటుగా వెళుతున్న వారు గమనించి కుటుంబ సభ్యులకు తెలియచేయడంతో వారు వెళ్ళి చూడగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

ఇంట్లో ఇస్త్రీ చేస్తుండగా షాక్ కొట్టి ప్రైవేటు ఉద్యోగి..



దెందులూరు : ఏలూరులో ఒక ప్రైవేటు కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న దోసపాడు గ్రామానికి చెందిన జంగం తంబి (26) తన ఇంట్లో బట్టలను ఇస్త్రీ చేసుకుంటున్న సమయంలో షాక్ కొట్టడంతో స్పృహతప్పి పడిపోయాడు. కుటుంబ సభ్యులు ఏలూరు ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు తంబి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంచారు

విద్యుదాఘాతంతో అన్నమయ్య జిల్లాలో వ్యాపారి దుర్మరణం..



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన పదిలం శీను..



ప్రమాదానికి గురైన ఐషర్ వాహనం

వాల్మీకిపురం, జూలై 31: విద్యుత్ షాక్‌కు గురై పెదవేగి మండలం చక్రాయగూడేనికి చెందిన వ్యాపారి పదిలం శీను (41) అన్నమయ్య జిల్లా వాల్మీకిపురంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. శీను వ్యాపారం నిమిత్తం ఏలూరు నుంచి చాక్లెట్ తయారీ సామగ్రిని ఐషర్ లారీలో తమిళనాడులోని దారాపూర్‌కు తీసుకెళ్లాడు. అక్కడ సామగ్రి దించి తిరిగి అదే లారీలో బయలుదేరాడు. లారీ డ్రైవర్ రెడ్డప్ప అత్తగారి ఊరు వాల్మీకిపురం. అత్తగారి ఇంటికి వెళ్లేందుకు బుధవారం తెల్లవారుజామున లారీని స్థానిక బైపాస్ రోడ్డులో ఓ పక్కగా ఆపి వెళ్లాడు. లారీ ఇళ్లకు అడ్డంగా ఉందని స్థానికులు చెప్పారు. డ్రైవర్ రెడ్డెప్ప ఎంతకూ రాకపోవడంతో లారీలోనే ఉన్న పదిలం శ్రీను ఉదయం 6 గంటలకు లారీని అక్కడ నుంచి తీసి రోడ్డు పక్కన ఆపి లారీ నుంచి కిందికి దిగగానే అప్పటికే లారీ పైభాగాన్ని విద్యుత్ తీగలు తాకి ఉండడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐ పులి శేఖర్, ఎస్ఐ నాగేశ్వర్‌రావు సంఘటనా స్థలానికి చేరుకుని జరిగిన ప్రమాదంపై విచారణ చేపట్టారు. శీను మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా బైపాస్ రోడ్డులో విద్యుత్ మెయిన్ లైన్ తీగలు కిందికి వేలాడడమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. లారీ డ్రైవర్ రెడ్డప్పను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగు మందు తాగి..

భీమడోలు : భీమడోలు మండలం పూళ్ళ గ్రామానికి చెందిన గుంట త్రిమూర్తులు (30) ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక పురుగు మందు తాగి మృతి చెందినట్టు భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.పూళ్ళ గ్రామానికి చెందిన గుంట త్రిమూర్తులు సుమారు ఐదు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొంత కాలంగా అప్పులతో ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నేపథ్యంలో 29వ తేదీ రాత్రి పూళ్ళ శివారు నాగేశ్వరరావుపేట భవానీ అమ్మవారి గుడి సమీపంలోని పొలాల్లో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించగా 30వ తేదీ మధ్యాహ్నం మృతి చెందాడు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యం తట్టుకోలేక పురుగుమందు తాగి ఒకరు..

లింగపాలెం : లింగపాలెం మండలం బోగోలు గ్రామానికి చెందిన దాసరి వెంకట నారాయణ (42) అనారోగ్య కారణాలతో పురుగుమందు తాగి చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం రాత్రి పురుగుమందు తాగి స్పృహ కోల్పోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం విజయవాడలోని ఆసుపత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ బుధవారం మరణించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు.



మంగపతి బోదెలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

పంట కాలువ పూడిక తొలగించాలని రైతుల నిరసన

పోలవరం, జూలై 31: కొత్తపట్టిసీమ ఆయకట్టులో మంగపతిబోదె, చెల్లాయమ్మ చెరువుల పూడికతో సాగు నీరందడం లేదని, పూడిక తొలగించాలని బుధవారం నిరసన వ్యక్తం చేశారు. మంగపతిబోదెలో దిగి రైతులు తమ సమస్యలు వివరించారు. మంగలిగడ్డ వాగు వల్ల మంగపతిబోదె, చెల్లాయమ్మ చెరువులో భారీ ఇసుక మేటలు వేశాయని, అధికారులకు తెలిపినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యంత్రాలతో పూడిక తొలగిస్తే సాగు నీరందుతుందని రైతులు తెలిపారు. జనసేన నాయకుడు గునపర్తి చిన్ని మాట్లాడుతూ ఈ విషయంపై ఎమ్మెల్యేతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు.

కృష్ణా డెల్టా శివారు భూములకు సాగు నీరివ్వాలి



రాజుపేటలో నారు చూపుతున్న రైతు ప్రతినిధులు

పెదపాడు, జూలై 31: కృష్ణా డెల్టా శివారు భూములకు సాగు నీరందించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రాజుపేటలో రైతులు బుధవారం ఆందోళన నిర్వహించారు. సాగు నీరందని నారుమడులను పరిశీలించారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సాగు నీరందక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మండల కార్యదర్శి గుండపనేని సురేష్ మాట్లాడుతూ నదుల్లో సమృద్ధిగా నీరున్నా పంటలకు అందడం లేదని, గుర్రపుడెక్క, తూడు, చెత్తా చెదారం తొలగింపు చర్యలు చేపట్టాలన్నారు. రైతులు, కౌలురైతులు పాల్గొన్నారు.

పెద్దచెరువు ఆక్రమణ తొలగించాలని రైతుల వినతి

చింతలపూడి, జూలై 31: పెద్దచెరువు చెరువు ఆక్రమణలు తొలగించాలని కలెక్టర్‌కు రైతులు విన్నవించారు. బుధవారం పట్టణంలో పర్యటించిన కలెక్టర్ వెట్రిసెల్వికి సాగునీటి సమస్య వివరించారు. చెరువు నీటి సామర్థ్యం తగ్గిందని గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించామన్నారు. చెరువు ఆక్రమణలు తొలగించి నీటి సామర్థ్యం పెంచాలని రైతు సీహెచ్ అంజిబాబు వినతిపత్రం అందజేశారు. ఆంథోనినగర్ పాఠశాలలో చుట్టూ వర్షం పడితే చెరువులా మారుతోందని, విద్యార్థులు వెళ్లడానికి దారిలేదని, పరిసరాలు మెరక చేయించి విద్యార్థులకు సౌకర్యం కల్పించాలని ఆంథోని నగరవాసి జోజి, కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నిల్వ నీటిలో ఆయిల్‌బాల్స్ వేస్తున్న ఎంహెచ్‌వో

ఏలూరు టూటౌన్, జూలై 30: సీజనల్ వ్యాధులపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రం ఉంచుకోవాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రెడ్డి మాలతి సూచించారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా 23వ డివిజన్ ఫిరంగుల దిబ్బ, రామాలయం రోడ్డు, సగర్ల వీధి, చెరువుగట్టు రోడ్డు ప్రాంతాల్లో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. దోమల నిర్మూలనకు స్ప్రేయింగ్, ఫాగింగ్, నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేశారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణుగోపాలస్వామి, సూపర్‌వైజర్ దుర్గారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు, రెడ్డి రామకృష్ణ, ఆరోగ్య కార్యదర్శి, ఆశాకార్యకర్తలు, పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన అవసరం



ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

ఏలూరు అర్బన్, జూలై 31: దోమల ద్వారా సంక్రమించే వ్యాధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎన్ఆర్ పేట అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రగతి సూచించారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవ ముగింపు కార్యక్రమం బుధవారం సెయింట్ గ్జేవియర్ హైస్కూలులో జరిగింది. డాక్టర్ ప్రగతి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత లోపిస్తే డెంగీ, మలేరియా, చికున్‌గున్యా ప్రబలుతాయని హెచ్చరించారు. జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు మాట్లాడుతూ దోమల నిర్మూలనలో విద్యార్థుల భాగస్వామ్యం కూడా అవసరమన్నారు. ర్యాలీ, మానవహారం నిర్వహించారు. వైద్య సిబ్బంది హేమ, శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని మాతృభాషా వలంటీర్ల ఆందోళన



వినతిపత్రం ఇస్తున్న మాతృభాషా వలంటీర్లు

బుట్టాయగూడెం, జూలై 31: ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో మాతృభాషా విద్యా వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ బుధవారం ఆందోళన చేశారు. అనంతరం ఐటీడీఏ మేనేజర్ ప్రకాశ్, పీఎంఆర్‌సి ఏఎంవో కె.శిరమయ్యకు వినతిపత్రం అందజేశారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో ఎప్పటి నుంచో అధికారులు మాతృభాషా విద్యా వలంటీర్లను కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరం వారిని విధుల్లోకి తీసుకోకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కుంజా నవీన్, ప్రసాద్, పృథ్వీ వలంటీర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు

కామవరపుకోట, జూలై 31: వ్యవసాయ కార్మికులకు కేరళ తరహాలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కామవరపుకోటలో బుధవారం జరిగిన సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.మహంకాళిరావు అధ్యక్షత వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై కసరత్తు చేస్తూ ప్రకటనలు కూడా చేశారని తెలిపారు. వ్యవసాయ కార్మికుల కోసం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడానికి ఒక్కమాట కూడా నిర్ణయం చేయలేదని విమర్శించారు. వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించి విధివిధానాలను వెంటనే రూపొందించాలని కోరారు. కేరళ తరహాలో సంక్షేమ బోర్డును అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎం.రవి, జీవరత్నం, రామకృష్ణ, ముత్యాలమ్మ, దానియేలు, సుధారాణి, యు.వెంకటేష్, ఎ.ప్రభాకర్, ఎ.చంటి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో మంచానికే పరిమితం

కలెక్టరేట్ వద్ద బాధితుని కుమారుడి ఆందోళన

ఏలూరు రూరల్, జూలై 31: జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంతో తన తండ్రి తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితం అయ్యాడని, న్యాయం చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద కుమారుడు బుధవారం ధర్నా నిర్వహించాడు. తంగెళ్ళమూడి బి.డి కాలనీకి చెందిన మారోజు బీమరాజు రెండేళ్లుగా ఇంటివద్దే ఉంటున్నాడని కుమారుడు కృష్ణకిషోర్ తెలిపారు. అనారోగ్యంతో జూలై 13న ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిటీర్ణం ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారన్నారు. 18న శస్త్రచికిత్స చేశారని, ఆరోజు రాత్రి నుంచి భీమరాజు వాంతులు, జ్వరంతో బాధపడ్డాడని తెలిపారు. సర్జరీ చేసిన వైద్యులను సంప్రదిస్తే రక్తపరీక్షలు, సిటీస్కాన్ చేయించాలని సూచించారు. రక్తం తక్కువ ఉన్నట్లు పరీక్షలో తేలిందన్నారు. అయినా వైద్యం చేయడంతో తన తండ్రి పక్షవాతంతో మంచాన పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై చర్యలు తీసుకుని చేశారని, తన తండ్రికి న్యాయం చేయాలని కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

అభివృద్ధే లక్ష్యం

మీకోసం గ్రామసభల్లో చింతమనేని ప్రభాకర్

జంగారెడ్డిగూడెం, లింగపాలెంలో రోషన్‌కుమార్ పర్యటన



మీకోసం సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదపాడు, జూలై 31 : గత ఐదేళ్ల వైసీపీ అవినీతి పాలనతో గ్రామాలు అభివృద్ధి లేక సమస్యల్లో కూరుకుపోయాయని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఏపూరు, అప్పనవీడు, కలపర్రు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన మీ కోసం - మీ చింతమనేని కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలసి గ్రామాల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అంతర్గత రహదారులు, పారిశుధ్యం నిర్వహణ, చెత్త సేకరణ, తరలింపు, రక్షిత మంచినీటి సరఫరా, వీధిదీపాల మరమ్మతులు, డ్రెయిన్ల పూడికతీత, అర్హులకు సంక్షేమ పథకాలు అమలు వంటి అనేక అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. చింతమనేని మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు సీఎం చంద్రబాబు ముందుకు వెళుతున్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

జంగారెడ్డిగూడెం, జూలై 31: ఇంటర్ విద్య భవిష్యత్‌కు పునాది అని, విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకుని ముందుకు సాగాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం ఆయన పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అధిక మార్కులు సాధించిన రెల్లి ఇందుశ్రీకి కౌన్సిలర్ రమాదేవి రూ.2వేలు ప్రోత్సాహకం అందజేశారు. డీవీఈవో ప్రభాకరరావు, దాసరి శ్యాం చంద్రశేషు, రావూరి కృష్ణ, తూటిగుంట రాము, పారేపల్లి రామారావు, అబ్బిన దత్తాత్రేయ, కౌన్సిలర్లు వలవల తాతాజీ, జ్యోతి, నంబూరి రామచంద్రరాజు, పగడం సౌభాగ్యవతి, రాజ్‌పాల్‌కుమార్, అంబేద్కర్, చెరుకూరి శ్రీధర్, కొండ్రెడ్డి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం ఏరియా ఆస్పత్రిని సందర్శించి కూటమి నాయకులు సమకూర్చిన బెడ్‌షీట్‌లను ఆర్ఎంవో డాక్టర్ వి.రాంబాబుకు అందజేశారు. ఆస్పత్రిలో ఉన్న వేలేరుపాడు, కుక్కునూరు మండలాల గర్భిణులు తమ గ్రామాలకు వెళ్లిపోతామని ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌కు తెలిపారు. గ్రామాల్లో వరద ఉధృతి లేదని, ఇళ్ల వద్ద పిల్లలు, భర్తలు ఉన్నారని తమను గ్రామాలకు పంపించాలని కన్నీటి పర్యంతమయ్యారు. ఇంకా నెలలు నిండలేదని ఇంటికి వెళ్లి తిరిగి వస్తామని ఎమ్మెల్యేకు వివరించారు. తర్వాత టీడీపీ పట్టణ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రావూరి కృష్ణ, తూటిగుంట రాము, షేక్ ముస్తఫా, రాజాన పండు, వలవల తాతాజీ, చెరుకూరి శ్రీధర్, గుమ్మడి ప్రసాద్, కరుటూరి రమాదేవి, జ్యోత్స్న బిందు, దెందుకూరి రాజి పాల్గొన్నారు.

● లింగపాలెం: ధర్మాజిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. కళాశాల సమస్యలపై ప్రిన్సిపాల్, అధ్యాపకులతో మాట్లాడారు. కళాశాలలో అధ్యాపకుల కొరత ఉందని ప్రిన్సిపాల్ ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పేద విద్యార్థుల అడ్మిషన్ ఫీజు నిమిత్తం రోషన్‌కుమార్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. మాజీ జడ్పీటీసీ గుత్తా సత్యసాయి వరప్రసాద్ రూ.7వేలు తనగాల మురళి, రూ.5వేలు అందించారు.



జూనియర్ కళాశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న రోషన్

గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అన్నారు. కొణిజర్ల గ్రామంలో పలు కాలనీలను పరిశీలించారు. డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్య సమస్యలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. చిలుకబత్తుల బుచ్చియ్య, చిలకబత్తుల ప్రభాకర్, పల్లి శ్రీను, నాయుడు మహేష్, పలువురు తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: ప్రైవేటు కంపెనీలలో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సూచించారు. భీమడోలు మండలం అంబర్ పేట పరిధిలో సిరామిక్ పరిశ్రమను బుధవారం ఆయన సందర్శించారు. అక్కడ సిరామిక్ వస్తువుల తయారీ విధానాన్ని పరిశీలించారు. ఇలాంటి కంపెనీలలో యువతకు జీవనోపాధి అవకాశాలను కల్పించాలని సూచించారు. కంపెనీ అధికారులు ఆయనను సత్కరించారు.



ప్రశంసా పత్రాలు అందుకున్న వారితో ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ కిశోర్

ప్రతిభ కనబర్చిన అధికారులకు నగదు పురస్కారం

ఏలూరు క్రైం, జూలై 31 : విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఐజీ జీవీజీ.అశోక్‌కుమార్, ఎస్పీ కేపీఎస్.కిశోర్ అభినందించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ప్రశంసా పత్రాలు, నగదు రివార్డులను అందించారు. ఎస్ఈబీ ఏఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, పోలవరం సీఐ మధుబాబు, కొయ్యలగూడెం ఎస్ఐ విష్ణువర్ధన్, హెడ్ కానిస్టేబుల్ బాబూరావు, కానిస్టేబుళ్లు జయకుమార్, ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ రాజు, నిడమర్రు సీఐ ఎంవీ.సుభాష్, భీమడోలు సీఐ బీబీ.రవికుమార్, గణపవరం సీఐ వెంకటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ మణికుమార్, నిడమర్రు ఎస్ఐ ఆర్.శ్రీను, హెచ్‌సీ కె.నాగరాజు, కానిస్టేబుళ్ళు ప్రసాదరావు, నాగరాజు, కృష్ణ, కె.సత్యనారాయణ, పి.జగపతికి నగదు, ప్రశంసాపత్రాలు ఇచ్చి సత్కరించారు. భీమడోలు ఎస్ఐ రవికుమార్, ద్వారకాతిరుమల ఎస్ఐ సతీష్, హెచ్‌సీ ఎస్ శ్రీనివాస్, కానిస్టేబుల్ ఎంఎన్‌డి ప్రసాద్, జి.ధర్మరాజు, కుక్కునూరు ఎస్ఐ రామకృష్ణ, కానిస్టేబుల్ డానియేల్, చాట్రాయి ఎస్ఐ కేసీహెచ్ స్వామి కానిస్టేబుళ్లు కె.గిరిబాబు, షేక్ ఇమ్రాన్, విటి విష్ణువర్ధన్‌లకు నగదు, ప్రశంసాపత్రాలను అందించి ప్రశంసించారు.

ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ.అశోక్‌కుమార్‌ను ఎమ్మెల్యే బడేటి చంటి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

అర్బన్, రూరల్ తహసీల్దార్లు బదిలీ

ఏలూరు రూరల్, జూలై 31: ఏలూరు అర్బన్, రూరల్ మండల తహసీల్దార్లు బదిలీ అయ్యారు. ఎన్నికల విధులకు వచ్చిన తహసీల్దార్లు తిరిగి సొంత జిల్లాలకు బదిలీపై వెళ్ళారు. ఎన్నికల సమయంలో జరిగిన వ్యయ వివరాలు అన్ని బిల్లులతో సహా అందజేసిన వారికి రిలీవింగ్ ఆర్డర్లు ఇచ్చారు. అర్బన్ తహసీల్దార్ ముఖర్జీ, రూరల్ తహసీల్దార్లు రిలీవ్ అయ్యారు. వారి స్థానంలో తహసీల్దార్లుగా ఎవరిని నియమించారనేది తెలియాల్సి ఉంది. రెండు రోజుల్లో కొత్త తహసీల్దార్లు జాయిన్ కానున్నారు.

● నిడమర్రు: తహసీల్దార్ కె.పోసిబాబు బదిలీ అయ్యారు. ఆయనను రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఎన్నికల బదిలీల్లో వచ్చిన పోసిబాబు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం బదిలీ అయ్యారు. డీటీ ఏలూరి శేఖర్‌బాబు, ఆర్ఐ సుబ్బారావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: తహసీల్దారు సుభాష్ బుధవారం బదిలీ అయ్యారు. ఎన్నికల విధుల అనంతరం ఇటీవల సంభవించిన గోదావరి వరదలలో వేలేరుపాడు మండలంలో సేవలందించి అధికారుల మన్ననలను పొందారు. ఆయన బదిలీ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

మహిళ, శిశు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పెదవేగి, జూలై 31: మహిళ, శిశు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని సీడీపీవో కె.విజయలక్ష్మి అన్నారు. పెదవేగి, విజయరాయి, కొప్పాక సెక్టార్ల అంగన్‌వాడీ నెలవారీ సెక్టార్ సమావేశం బుధవారం నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలద్వారా పోషకాహారాన్ని అందిస్తుందని, మెరుగైన సేవలందించేలా కార్యకర్తలు కృషి చేయాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్.పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలు తక్షణమే చెల్లించాలి

ఏలూరు కార్పొరేషన్, జూలై 31: వరద ముంపులో చిక్కుకున్న వేలేరుపాడు, కుక్కునూరులో పేదలకు ఉపాధి హామీ బకాయిలు తక్షణమే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సీపీఐ కార్యాలయం వద్ద బుధవారం ఆయన మాట్లాడుతూ ముంపు బాధితులకు ఉపాధి హామీ డబ్బులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు.

మున్సిపల్ పాఠశాలల సహకార సంఘ ఎన్నికలు

ఏలూరు అర్బన్, జూలై 31: నగరంలోని మున్సిపల్ హైస్కూళ్ల బోధన, బోధనేతర సిబ్బంది సహకార సంఘానికి బుధవారం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా రత్నకుమార్, కార్యదర్శిగా పొట్టియ్య ఎన్నికయ్యారు. పదవీకాలం ముగిసిన సుబ్రహ్మణ్యం, ప్రతాప్‌ను సన్మానించారు. నూతనకార్యవర్గానికి ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారావు శుభాకాంక్షలు తెలియజేశారు.

మహిళా పోలీస్ సుజనకు అవార్డు



అవార్డు అందుకున్న లక్ష్మీ సుజన

ద్వారకాతిరుమల, జూలై 31: రాష్ట్రస్థాయి అఖిల భారత మహాసంఘం కడప జిల్లాలో నిర్వహించిన గురు పురస్కారాల కార్యక్రమంలో ద్వారకాతిరుమల మహిళా పోలీస్ పి.లక్ష్మీసుజనకు చండీ దళనాయికి (మహిళా శక్తి) అవార్డు అందజేశారు. ఈనెల 29న జరిగిన కార్యక్రమంలో అవార్డు అందజేశారు. మహిళలకు రక్షణ కల్పించాలనే సదుద్దేశంతో చండీదళాన్ని ఏర్పాటు చేశారు. అంకితభావంతో పనిచేస్తూ సమాజ శ్రేయస్సుకు పాటుపడుతున్న సుజనకు అవార్డుతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించి సత్కరించారు. ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ, దేవళ్ల సాయినాథ్ శర్మ, హనుమాన్ శాస్త్రి, వనజ, రమణి పాల్గొన్నారు.

బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శిగా దుర్గబాబు



నియామకపత్రం స్వీకరిస్తున్న దుర్గబాబు

కామవరపుకోట, జూలై 31: ఏపీ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సుదర్శనం రామదుర్గ కుమారా చార్యులు (దుర్గబాబు) ఎంపిక య్యారు. విశాఖలో బుధవారం ప్రమాణ స్వీకారం చేసినట్టు సమాఖ్య సభ్యులు తెలిపారు. పురోహితుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా చర్యలు తీసుకుంటామని కార్యవర్గ సభ్యులు ప్రకటించారు. 26 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించినట్టు వారు వివరించారు.

నేడు పింఛన్ల పంపిణీ

ఏలూరు రూరల్, జూలై 31: రూరల్ మండలం పరిధిలో లబ్ధిదారులకు 1న పింఛన్ అందేలా ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంపీడీవో బండి ప్రణవి తెలిపారు. మండలంలో 90మంది సచివాలయ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించారు. వృద్ధులు, వితంతువులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు, డయాలసిస్ బాధితులకు రూ.10వేలు చొప్పున పింఛన్లు అందజేయనున్నారు. మండలపరిధిలో 5347మందికి మొత్తం 22.92 కోట్లు పంపిణీ చేయనున్నారు. అందుబాటులో లేని లబ్ధిదారులకు 2న పంపిణీ చేస్తారు.

● ఉంగుటూరు: మండలంలో గురువారం కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీచేయనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం తెలిపింది.

● లింగపాలెం: మండలంలో లబ్ధిదారులకు ఇంటి వద్దే పింఛన్లు అందిస్తామని ఎంపీడీవో రాంబాబు తెలిపారు. మండలంలో 8036 మందికి రూ.3.44 కోట్లు పంపిణీ చేయనున్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల సహకారంతో పింఛన్లు అందజేస్తామని, నూరు శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

● కామవరపుకోట: మండలంలో 8157 మందికి పెన్షన్లు గురువారం అందచేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీవో జంగం స్వర్ణభారతి, ఏవో సత్యవాణి తెలిపారు. సచివాలయ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించి తగిన ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు.

డిగ్రీ జూనియర్లకు 'మిస్ ఫ్రెషర్' పోటీ

ఏలూరు అర్బన్, జూలై 31: కళాశాలలో జూనియర్, సీనియర్ విద్యార్థినుల స్నేహబంధాన్ని పెంపొందించేందుకు ఫ్రెషర్స్ డే నిర్వహిస్తున్నట్టు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల పీజీ విభాగం డైరెక్టర్ సిస్టర్ సుశీల అన్నారు. కళాశాల ఆడిటోరియంలో బుధవారం జూనియర్లకు వస్త్రధారణ, స్వీయ పరిచయం, ప్రశ్నోత్తరాల ద్వారా మూడు దశల్లో 'మిస్ ఫ్రెషర్' పోటీ నిర్వహించి విజేతకు కిరీటాన్ని ధరింపజేశారు. అధ్యాపకులు ఫాతిమా, ఇందిర, మహాలక్ష్మి, ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 118 మంది ఉద్యోగాలకు ఎంపిక

జంగారెడ్డిగూడెం, జూలై 31: స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన బుధవారం జాబ్ మేళాలో 118 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సుమారు 500 మంది అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొన్నారు. వివిధ కంపెనీల ప్రతినిధుల ఇంటర్వ్యూ నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కొందరికి ఆఫర్ లెటర్స్ వెంటనే అందచేశారని ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు తెలిపారు. సెట్‌వెల్ మేనేజర్ పీవీఎస్.సత్యనారాయణ, సూపరింటెండెంట్ కెజె.కెనడీ, వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, ఎమ్.మధు, జి.ప్రవీణ్ కృష్ణ, బి.అశోక్ పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్ వెంకటకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

నగరాభివృద్ధికి బాటలు వేసిన కమిషనర్

ఏలూరు టూటౌన్, జూలై 31: నగరాభివృద్ధికి కమిషనర్ సంకురాత్రి వెంకటకృష్ణ ఎంతో కృషి చేశారని పలువురు కొనియాడారు. వెంకటకృష్ణ ఉద్యోగ విరమణ సభ బుధవారం జరిగింది. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఏడాదిన్నర కాలంలో నగరాభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారన్నారు. 36 సంవత్సరాల సర్వీస్‌లో వెంకటకృష్ణ ఎన్నో అవార్డులు అందుకున్నారని ప్రశంసించారు. అనంతరం వెంకటకృష్ణను ఘనంగా సన్మానించారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్లు, విశ్రాంత కమిషనర్లు, మేయర్ షేక్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యుడు పెదబాబు, ఎస్ఈ వెంకటేశ్వరరావు, ఎంఈ కొండల్రావు, ఏఈలు సాయి, శేషగిరి, రఫీ, అజయ్, పీవోలు కృష్ణమూర్తి, మేనేజర్ మూర్తి, ఆర్వోలు శోభ, అరుణ, విజయభారతి, ఆర్ఐలు గాంధీ, ఎన్.రవి, నాగరాజు, సాయిపవన్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి పాత్ర చిరస్మరణీయం

ఏలూరు రూరల్, జూలై 31: ప్రతి విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుడి పాత్ర చిరస్మరణీయమని శనివారపుపేట జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రకాష్ అన్నారు. పాఠశాలలో సోషల్ టీచర్ పోలిశెట్టి వెంకట నరసింహారావు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు వెంకట నరసింహారావు, కనకదుర్గ దంపతులను సన్మానించారు. సుభాషిణి, దాసరి రవి, ఎడ్వర్డ్ పుష్పరాజ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణతో కుటుంబ బాధ్యత

పెదవేగి, జూలై 31: ఉద్యోగ విరమణతో కుటుంబ బాధ్యత మరింత పెరుగుతుందని ఎంఈవో సీహెచ్.బుధవాస్ అన్నారు. లక్ష్మీపురం పాఠశాల ఉపాధ్యాయుడు వంగపండు వెంకటరమణ ఉద్యోగ విరమణ సందర్భంగా సత్కరించారు. హెచ్‌ఎం పి.రమేష్, ఉపాధ్యాయులు పరసా నాగార్జున, వీరంకి శ్రీనివాసరావు, ఎండీ.షఫీ, రమేష్, గీతాంజలి, భూషణ్ పాల్గొన్నారు.

ఎస్ఐ సాంబశివరావు సేవలు ప్రశంసనీయం

ఏలూరు క్రైం, జూలై 31: ఏలూరు ట్రాఫిక్ స్టేషన్ ఎస్ఐ కడియాల సాంబశివరావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఘనంగా సత్కరించారు. ఏఎస్పీ జి.స్వరూపరాణి, ఇన్‌స్పెక్టర్లు మల్లేశ్వరరావు, ఆదిప్రసాద్, ఏఆర్ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా : ఒకరిపై కేసు

జంగారెడ్డిగూడెం, జూలై 31: జల్లేరు కాలువ నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరు యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీఆర్వో షేక్ బాజీకి వచ్చిన సమాచారంతో ఇసుక తరలిస్తున్న అందుగుల నాగరాజు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నగర పాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా చంద్రశేఖర్

ఏలూరు టూటౌన్, జూలై 31: నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటకృష్ణ ఉద్యోగ విరమణతో ఇన్‌చార్జ్ కమిషనర్‌గా డి.చంద్రశేఖర్ నియమితులయ్యారు. పూర్తి అదనపు బాధ్యతలతో మళ్లీ ఉత్తర్వులు వచ్చే వరకు పదవిలో కొనసాగాలని సీఆర్‌డీఏ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు అర్బన్ :** ఎస్టీయూ నేత, సీనియర్ టీచరు జీ.వీ.కృష్ణారావు కాళ్ళ మండలం సీసలిలోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. ఆయన మృతికి సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డీవీపీ.ప్రసాదరాజు, అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్, నారాయణ, పవన్‌కుమార్ సంతాపం తెలిపారు.
- **ఏలూరు టూటౌన్ :** మాజీ ఎంపీ, టీడీపీ సీనియర్ నేత మాగంటి బాబును టీడీపీ సీనియర్ నాయకుడు గోరంట్ల బుచ్చయ్యచౌదరి కలిశారు. అనంతరం బుచ్చయ్యచౌదరిని బాబు సత్కరించారు.
- **పెదపాడు :** సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో ఉచిత వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. 450 మంది విద్యార్థినులు, సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు, ప్రిన్సిపాల్ జి.సరళ పాల్గొన్నారు.
- **కామవరపుకోట :** ప్రభుత్వ డిగ్రీకళాశాలలో చరిత్ర, కామర్స్ సబ్జెక్టులకు గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.విజయబాబు తెలిపారు. వివరాలకు 9989929534, 8500284838 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.
- **ద్వారకాతిరుమల :** మంత్రి నారా లోకేశ్‌ను ఇమ్మడి రత్నాజీ, కూరాకుల బుజ్జి యాదవ్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శ్రీవారి ప్రసాదం, వాసవీ కన్యకా పరమేశ్వరి చిత్రపటం అందజేశారు.
- **జంగారెడ్డిగూడెం :** పట్టణంలో ఇసుక సమస్యను తాపీ పనివారల సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే రోషన్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని సంఘ అధ్యక్షుడు కోపిశెట్టి వెంకటసూరిబాబు తెలిపారు.
- మెప్మాఆర్పీలు, వెలుగు వీవోఏల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయం వద్ద కూటమి నాయకులకు వినతి పత్రం సమర్పించారు. రావూరి కృష్ణ, మేకా ఈశ్వరయ్యలు ఎమ్మెల్యే రోషన్‌కుమార్ దృష్టికి తీసుకువెళతామని తెలిపారు.
- జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలో 2021లో ముప్పిడి రాజు హత్యకేసుపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని తల్లిదండ్రులు ముప్పిడి ఏసు, మరియమ్మ ఎమ్మెల్యే రోషన్ కుమార్‌ను కోరారు.
- జంగారెడ్డిగూడెం బీజేపీ నాయకులు, కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టులలో ప్రాధాన్యం కల్పించాలని ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌కు కొప్పాక శ్రీనివాసరావు వినతి పత్రం సమర్పించారు. తుమ్మలపల్లి బ్రహ్మాజీ, తాటికొండ సుధాకర్, వేమూరి శ్రీనివాస్, రామమోహనరావు, గంటా అనూరాధ పాల్గొన్నారు.
- జంగారెడ్డిగూడెం పట్టణంలో సయ్యద్ ముంతాజ్ ఇంటి వద్ద తన భర్త మృతి చెందినట్లు కొయ్యలగూడెం కాళింగుపేటకు చెందిన షేక్ సలార్ జానీ పోలీసులకు పిర్యాదు చేశారు. రెండో భార్య ముంతాజ్ ఇంటి వద్ద తన భర్త మృతిపై అనుమానం వ్యక్తం చేసింది. కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ జె.మోషే తెలిపారు.
- **పోలవరం :** పోలవరం ప్రాజెక్టులో ప్రత్యేక భద్రతా విభాగం కానిస్టేబుల్ నూకా రాంబాబు, రాజీదుర్గ దంపతులు మహాత్మాగాంధీ వృద్ధాశ్రమంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. తమ కుమార్తె దీక్షిత పుట్టినరోజు సందర్భంగా 50 మంది వృద్ధులకు అన్నదానం నిర్వహించినట్లు రాంబాబు తెలిపారు.



చింతలపూడిలో వాసవీ మాతకు సారె తీసుకెళుతున్న మహిళలు, ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ, వాసవీ మాత, బుట్టాయగూడెం త్రిశక్తి పీఠంలో అమ్మవార్లకు సారె

అమ్మవార్లకు ఆషాఢ సారె

ద్వారకాతిరుమల, జూలై 31: కుంకుళ్లమ్మకు పలు సేవా మండళ్ల ఆధ్వర్యంలో బుధవారం ఆషాఢ సారె సమర్పించారు. పోతునూరు శ్రీనివాసా సేవాసమితి, మొగల్తూరు బండి ముత్యాలమ్మతల్లి సేవా సమితి సభ్యులు క్షేత్రదేవతకు చీర, గాజులు, పూలు, పళ్ల వివిధ రకాల స్వీట్లను అదించారు.

వాసవీ కన్యకా పరమేశ్వరి శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఆర్యవైశ్య మహిళలు, ఆషాఢ సారె అందజేశారు. ఆర్యవైశ్యులు, మహిళలు పాదయాత్రగా ఆలయానికి చేరుకుని చీర, గాజులు, పూలు, పండ్లు, స్వీట్లను అమ్మవారికి సమర్పించారు. మానేపల్లి బాబ్జి, రత్నాజీ, ఇమ్మడి నాగు, నార్ల రాజేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

● నిడమర్రు: ఎనికేపల్లి గ్రామదేవత ముత్యాలమ్మకు గ్రామస్తులు ఆషాఢం సారె సమర్పించారు. ఇటీవల నూతనంగా నిర్మించిన ఆలయంలో గ్రామస్తులంతా కలసి సారె సమర్పించారు. సుమారు 300 మంది మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ పుప్పాల మెహర్‌కుమార్ దంపతులు, పుప్పాల మహంకాళి, జవ్వాది బాలాజి పాల్గొన్నారు.

● చింతలపూడి: పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీమాతకు సారె సమర్పించారు. కోదండ రామాలయంలో వాసవీ మాత విగ్రహానికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పాత బస్టాండ్‌లో ఆంజనేయస్వామి ఆలయం నుంచి మహిళలు ఊరేగింపుగా కోదండ రామాలయం చేరుకుని అమ్మవారి విగ్రహం వద్ద సారె ఉంచి పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు వజ్రపు శేఖర్, కార్యదర్శి కొనకళ్ళ ప్రసాద్, నాయకులు జె.హరిప్రసాద్, చిట్లూరి అంజిబాబు, ఈశ్వర్, భక్తులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: స్థానిక త్రిశక్తి పీఠంలో కొలువైన మహాదుర్గ, మహాలక్ష్మీ, మహా సరస్వతి అమ్మవార్లకు మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. ఆషాఢ మాసంలో గ్రామ దేవతలకు సారెను సమర్పించడం సంప్రదాయం. వివిధ రకాల స్వీట్లు, పండ్లు, పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను అమ్మవార్లకు సమర్పించారు. ఆలయ పురోహితుడు అనిపెద్ది సందీప్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు సారెను ప్రసాదంగా అందించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

● దెందులూరు: పెరుగుగూడెం గ్రామ దేవత పాటిమ్మ తల్లి కి భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. పసుపు, కుంకుమ, సారెతో 118 మంది ముత్తైదువులు ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఛైర్మన్ యలమర్తి శ్రీనివాస్, హేమలత దంపతులు, కమిటీ సభ్యులు యలమర్తి వెంకట మురళీకృష్ణ, బొర్రయ్య, రాంబాబు, రామయ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు పూర్తిచెయ్యండి

పార్లమెంట్‌లో ఎంపీ మహేష్



రాష్ట్రంలో పెండింగులో ఉన్న రైల్వే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. బుధవారం ఎంపీ మహేష్ పార్లమెంట్‌లో మాట్లాడుతూ బడ్జెట్‌లో రైల్వే మౌలిక సదుపాయాల కోసం రూ.9151 కోట్లు కేటాయించటం పట్ల ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, మంత్రి లోకేష్ తరపున ధన్యవాదాలు తెలిపారు. గత ఏడాది కేటాయించిన బడ్జెట్ కంటే 8.65 శాతం ఎక్కువని హర్షం వ్యక్తం చేశారు. వందేభారత్ రైళ్లను ఏలూరు స్టేషన్‌లో ఆపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కోటిపల్లి-నర్సాపూర్ రైల్వేలైన్, విజయవాడ- గూడూరు, గుడివాడ - నూజీవీడు, భద్రాచలం - కొవ్వూరు రైల్వే మార్గాలను త్వరిత గతిన పూర్తిచేయాలని కోరారు. రైల్వేస్టేషన్‌ను ఆధునీకరించి ప్రయాణీకులకు సౌకర్యాలు మెరుగుపరచాలని కోరారు. ఏలూరు రైల్వేస్టేషన్‌ను అమృత్ స్టేషన్ల పథకంలో చేర్చడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. వృద్ధులు మహిళలు, విభిన్నప్రతిభావంతుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

-ఏలూరు టూటౌన్

'30 నెలలుగా ఎదురుచూపు'పై.. వివరాలు కోరిన అధికారులు

ముదినేపల్లి, జూలై 31 : మండలంలోని పెదపాలపర్రు పీఏసీఎస్ నుంచి ఒక రైతు రెండున్నర సంవత్సరాల క్రితం అమ్మిన ధాన్యానికి పూర్తిగా సొమ్ములు నేటికీ అందని విషయం కృష్ణా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారుల దృష్టికి వెళ్లింది. ఆ గ్రామానికి చెందిన రైతు ఈదర జనార్దనరావు పొలం కౌలుకు చేస్తున్న కోడూరు శ్రీనివాసరావు 2022 ఫిబ్రవరి 15న ఆ సొసైటీ ద్వారా అమ్మిన ధాన్యానికి రూ.63 వేలు రావాల్సి ఉండటం, దీనిపై సొసైటీ అధికారులు త్వరగా తనకు సొమ్ములు ఇవ్వకపోతే ఆమరణ దీక్ష చేస్తానని మంగళవారం మీడియా ముందు కౌలు రైతు ప్రకటించటంతో ఆ గ్రామ టీడీపీ నాయకుడు చల్లగుళ్ల ఆదిత్య చొరవ తీసుకుని ఈ విషయాన్ని బుధవారం సివిల్ సప్లయిస్ శాఖ విజయవాడ జిల్లా కార్యాలయ ఏడీఈఈ సృజన దృష్టికి తీసుకెళ్లారు. ఆమె కోరిన వివరాలను పంపగా, తాను పరిశీలించి జిల్లా మేనేజర్‌తో చర్చించి తగు చర్యలు తీసుకుంటానని చెప్పినట్లు ఆదిత్య తెలిపారు.

ఎంఈవోకు ప్రభాకర్‌కు పదవీ విరమణ సత్కారం



కలిదిండి, జూలై 31 : ఉద్యోగ విరమణ చేసిన కలిదిండి ఎంఈవో-2 పిడుగు ప్రభాకర్ బాబును బుధవారం ఉపాధ్యాయ సంఘాల నాయకులు, డీవైఈవో రవి ప్రకాష్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖాధికారిగా, ప్రధానోపాధ్యాయుడిగా, ఉపాధ్యాయుడిగా ప్రభాకర్‌బాబు అందించిన సేవలను కొనియాడారు. విద్యార్థులను సొంత పిల్లలులాగా చూసుకుంటూ పాఠశాలల్లో విద్యావృద్ధికి కృషి చేశారని తెలిపారు. డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను, ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, రిటైర్డ్ డీవైఈవో జార్జి రాజు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభిమానం చూరగొనాలి



ముదినేపల్లి, జూలై 31: విద్యార్థులు, వారి తల్లిదండ్రుల మనస్సుల్లో స్థానం సంపాదించినప్పుడే ఉపాధ్యాయ వృత్తికి సార్థకత ఉంటుందని ముదినేపల్లి ఎంఈవో ఎం.సేవ్యా అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన మండలంలోని చిగురుకోట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వల్లూరు సూర్యప్రకాశరావు, కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రఘునాథబాబును బుధవారం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. ఎంఈవో-2 నరేష్ కుమార్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు గొట్టిపాటి రమేష్, బేతాళ రాజేంద్ర ప్రసాద్, సాయిలక్ష్మి, ఐ.దుర్గా ప్రసాద్, వల్లూరు సత్యనారాయణ, బేతాళరావు, దినేష్ బాబు, యశోద కృష్ణ, ఎంవీ మల్లేశ్వరరావు, వీర పాప తదితరులు రిటైరైన ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

మంత్రి లోకేశ్‌ను కలసిన టీడీపీ నేత శ్రీనివాస్



ముదినేపల్లి, జూలై 31 : రాష్ట్ర విద్యా, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఈడ్పుగంటి శ్రీనివాస్ కలిశారు. బుధవారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో కలసి అభినందనలు తెలిపి గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత నివారించాలని, ఐటీ కంపెనీలను ఏర్పాటు చేయించేందుకు చొరవ చూపాలని శ్రీనివాస్ కోరారు.

మహిళా సాధికారత కోసమే మిషన్ శక్తి



మండవల్లి జూలై 31 : కేంద్ర ప్రభుత్వ మిషన్ శక్తి పథకం మహిళల సాధికారత కోసమేనని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ నాగలక్ష్మి అన్నారు. బుధవారం పెరికేగూడెంలో నిర్వహించిన బేటీ బచావో.. బేటీ పడావో సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాలికల రక్షణ, విద్య, లింగనిర్ధారణను నివారించేందుకే బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని కేంద్రం అమలు చేస్తోందన్నారు. మిషన్ శక్తిలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో బాలికల నమోదు శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ జే. మోతీబాయి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వి. సీత, ఏఎన్ఎం ఏసు ప్రేమ, ఆశా కార్యకర్త సునీత, అంగన్వాడీ కార్యకర్త వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

క్రైం సమాచారం

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరి మృతి

లింగపాలెం : లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన నక్కా దుర్గారావు (23) బుధవారం తెల్లవారుజామున ధర్మాజీ గూడెంలోని చెరువుకు బహిర్భూమికి అని వెళ్ళి ప్రమాదవశాస్తు కాలుజారి చెరువులో పడి చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఉదయం అటుగా వెళుతున్న వారు గమనించి కుటుంబ సభ్యులకు తెలియచేయడంతో వారు వెళ్ళి చూడగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇస్త్రీ చేస్తుండగా షాక్ కొట్టి ప్రైవేటు ఉద్యోగి..

దెందులూరు : ఏలూరులో ఒక ప్రైవేటు కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న దోసపాడు గ్రామానికి చెందిన జంగం తంబి (26) తన ఇంట్లో బట్టలను ఇస్త్రీ చేసుకుంటున్న సమయంలో షాక్ కొట్టడంతో స్పృహతప్పి పడిపోయాడు. కుటుంబ సభ్యులు ఏలూరు ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు తంబి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంచారు

పేకాట శిబిరంపై దాడి.. రూ. 1.25 లక్షలు స్వాధీనం

చాట్రాయి, జూలై 31: మండలంలోని కృష్ణారావుపాలెంలో పేకాట శిబిరంపై బుధవారం దాడి చేసి రూ. 1.25 లక్షలు, 6 బైక్‌లు స్వాధీనం చేసుకొని, 9 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై స్వామి తెలిపారు. మండలంలో ఎక్కడైనా జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఈ రహదారిపై.. నడిచేదెలా?

- గోపవరంలో అధ్వానంగా అంతర్గత రహదారులు
- కనీస మరమ్మతులకు మహిళల వినతి



గోపవరం బీసీ కాలనీలో రహదారిని చూపుతున్న మహిళలు

ముసునూరు, జూలై 31: మండలంలోని గోపవరం పంచాయతీలో అంతర్గత రహదారులు అధ్వానంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీసీ, ఎస్సీ, ఓసీ కాలనీల్లో అంతర్గత రహదారులు వర్షాలకు బురదమయంగా మారాయని, వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో పనులకు నడిచి వెళ్ళడానికి నరకం చేస్తున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో అంతర్గత రహదారులు అభివృద్ధికి నోచుకోలేదని, ఒక్క సీసీ రోడ్డు కూడా వేయకపోగా, కనీసం గ్రావెల్‌తోనైన అభివృద్ధి చేయలేదని మహిళలు వాపోతున్నారు. ఈ రహదారుల దుస్థితిని చూస్తున్న పంచాయతీ పాలకులు, అధికారులు సైతం తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. చేస్తున్నారు. ఇప్పటికైన అంతర్గత రహదారులను గ్రావెల్‌తోనైన అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

పంట కాల్వలకు నీటి విడుదల పెంపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముదినేపల్లి, జూలై 31 : నీటి ఎద్దడితో ఎండిపోతున్న వెదజల్లిన సార్వా వరి పైరుకు సాగు నీరందించేందుకు ఇరిగేషన్ శాఖ చర్యలు చేపట్టింది. "పైరు ఎండుతోంది" శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. ముదినేపల్లి మండలంలోని పలు గ్రామాల ఆయకట్టుకు నీరందక ఎండిపోతున్న వరి పైరును రక్షించుకునేందుకు కోడూరు, చినపాలపర్రు, అత్తివాని చెరువు, రెడ్డిపూడి, ముదినేపల్లి గ్రామాల రైతుల ఇబ్బందులపై వెంటనే దొండపాడు కాల్వ నుంచి పై గ్రామాలకు నీరందించే ప్రధాన పంట కాల్వకు నీటి విడుదలను పెంచారు. ఈ బ్రాంచి కాల్వ ద్వారా పర్నాస, కోడూరు కాల్వలకు నీరు విడుదల చేస్తున్నారు. దీంతో ఎండిపోతున్న వరి పొలాలకు నీరు పెట్టుకునేందుకు రైతులు యత్నిస్తున్నారు. కొంతమంది రైతులు పంట కాల్వలపై ఇంజన్లు ఏర్పాటు చేసి నీరు తోడుతున్నారు. గుడ్లవల్లేరు లాకుల వద్ద క్యాంప్ బెల్, పోల్ రాజ్ కాల్వలకు కూడా నీరు విడుదల పెంచారు. క్యాంప్ బెల్‌కు 130 నుంచి 155 క్యూసెక్కులు, పోల్‌రాజ్‌కు 140 నుంచి 185 క్యూసెక్కులకు నీటి విడుదల పెంచినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.





ప్రధాన పంట కాల్వకు నీటి విడుదల (ఇన్‌సెట్) అత్తివానిచెరువు గ్రామం వద్ద కాలువ నుంచి ఇంజన్‌తో నీరు తోడుతున్న దృశ్యం

మంత్రి ఆదేశాలతో సప్లై ఛానల్ పరిశీలన



ముసునూరు, జూలై 31: మంత్రి పార్థసారథి ఆదేశాలతో మండలంలోని లోపూడి తమ్మిలేరు నుంచి గుళ్ళపూడి, గుడిపాడు, వలసపల్లి గ్రామాల్లో చెరువులకు నీరు వెళ్ళే సప్లై ఛానల్‌ను తమ్మిలేరు ఇరిగేషన్ అధికారులు బుధవారం పరిశీలించారు. లోపూడి వద్ద తమ్మిలేరు వరద ఉధృతికి ఈ సప్లై ఛానల్ కోతకు గురవుతోందని, దీంతో కాలువలోకి నీరు సమృద్ధిగా రావడం లేదని ఇటీవల మూడు గ్రామాల రైతులు మంత్రి దృష్టికి తీసుకువెళ్ళగా, ఆయన సప్లయి ఛానల్‌ను పరిశీలించి, సమస్య పరిష్కరించాలని తమ్మిలేరు ఇరిగేషన్ అధికారులను ఆదేశించినట్టు రైతులు కొల్లి గంగారామ్, గద్దె రఘుబాబు, మందలపు శ్రీనివాసరావు తదితరులు తెలిపారు. డీఈ శ్రీనివాసరావు, ఏఈ పరమానందం సప్లై చానల్‌ను పరిశీలించి, రైతులతో సమస్యపై చర్చించారు. సప్లై చానల్ కోతకు గురయ్యే చోట తమ్మిలేరు వరద ఉధృతిని తట్టుకునేలా గోడ నిర్మాణానికి అవసరమైన నిధులకు ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపుతామని డీఈ శ్రీనివాసరావు తెలిపారు. పలువురు రైతులు పాల్గొన్నారు.



సారెను తీసుకువెళుతున్న మహిళలు

శ్రీశ్యామలాంబ అమ్మవారికి ఆషాఢ సారె

కైకలూరు, జూలై 31: కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారికి, ఆలయంలో కొలువైయున్న శ్రీరామలింగేశ్వరస్వామివారికి వెలంపేట కాలనీ మహిళలు బుధవారం కైకలూరు వెలంపేట కాలనీ నుంచి ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని సారెను సమర్పించారు. గ్రామానికి చెందిన కమల బృందం, సింహాచలం బృందం సారెను తీసుకువచ్చారు. ఆలయ ఈవో శేఖర్ వారికి స్వాగతం పలకగా అర్చకులు విశేష పూజలను నిర్వహించారు.

హుండీల ఆదాయం లెక్కింపు



కైకలూరు జూలై 31 : కైకలూరు లోని మీసాల వేంకటేశ్వరస్వామి, శ్రీశ్యామ లాంబ, పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి హుండీల ఆదాయాన్ని లెక్కించినట్టు ఆలయ కార్య నిర్వహణాధికారి వీఎస్‌కే శేఖర్ తెలిపారు. బుధవారం గుడివాడ ఎండోమెంట్ తనిఖీ అధికారి వి. సుధాకర్ పర్యవేక్షణలో హుండీల ఆదాయం లెక్కించగా మీసాల వేంకటేశ్వర స్వామివారికి రూ.1,35,558, శ్రీశ్యామ లాంబ అమ్మవారికి రూ.2,66,808లు, రామలింగేశ్వరస్వామివారికి రూ.23,744లు హుండీ ఆదాయం వచ్చినట్టు తెలిపారు. లెక్కింపులో శ్రీమన్నారాయణ గోష్టి మహిళలు, భక్తులు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.



పెదలంక కాల్వ అంచున నాటిన కొబ్బరి మొక్కలు

కొబ్బరి మొక్కలు తొలగించాలి

కలిదిండి,జూలై 31 : గుర్వాయిపాలెం సమీపం లో పెదలంక కాల్వ వెం బడి నాటిన కొబ్బరి మొక్క లను తొలగించాలని రైతు లు కోరుతున్నారు. కాల్వ అంచున కొబ్బరి మొక్కలు నాటడం వల్ల కాల్వ పూడికతీత సమయంలో ఇబ్బందులుంటాయన్నారు. అలాగే కాల్వలోకి కొబ్బరాకులు రాలటం వల్ల నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ప్రస్తుతం నాటిన కొబ్బరి మొక్కలను తీసివేసి కాల్వ గట్టు అవతల వైపు నాటితే ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. ఇప్పటికైనా ఉపాధి అధికారులు స్పందించి పెదలంక వెంబడి ఉన్న కొబ్బరి మొక్కలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

తొలగిస్తాం: ఉపాధి ఏపీవో

ఈ విషయమై ఉపాధి ఏపీవో ఆనంద్‌ను వివరణ కోరగా, పెదలంక కాల్వ వెంబడి నాటిన కొబ్బరి మొక్కల తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. నీటి సరఫరాకు, పూడికతీతకు ఇబ్బంది లేకుండా అవతల వైపు మొక్కలు నాటుతామన్నారు.

ఉత్తమ బోధన అందించాలి : ఎంఈవో



ముసునూరు, జూలై 31: విద్యార్థులకు ఉత్తమ బోధన అందించి, వారి ఉజ్వల భవిష్యత్‌కు ఉపాధ్యాయులు బాటలు వేయాలని ఎంఈవో బీవీ సుబ్బారావు అన్నారు. బుధవారం ముసునూరు గురుకుల బాలికల పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. హాజరు, మెనూ రికార్డులను పరిశీలించి, భోజన నాణ్యత, మంచినీటి సరఫరా ట్యాంక్‌లు, సైన్స్ ల్యాబ్, మరుగుదొడ్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనేక ప్రాంతాల నుంచి బాలికలు ఈ పాఠశాలలో చదువుకునేందుకు వచ్చారని, వారి రక్షణ, ఆర్యోగం పట్ల శ్రద్ధ తీసుకోవాలని ప్రిన్సిపాల్ కె.ప్రవీణకు సూచించారు.

నాణ్యమైన చేప పిల్లలతో అధిక దిగుబడులు



రవికుమార్
మత్స్య శాఖాభివృద్ధి అధికారి

కలిదిండి,జూలై 31 : నాణ్యమైన చేప పిల్లల ఎంపికతో అధిక దిగుబడులు సాధించవచ్చని మత్స్య శాఖాభివృద్ధి అధికారి రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేప పిల్లలను కొనుగోలు చేసే సమయంలో వాటికి ఆక్వా ల్యాబ్‌లో పరీక్షలు చేయించాలన్నారు. వ్యాధులు లేవని నిర్ధారణ అయిన చేప పిల్లలనే కొనుగోలు చేయాలన్నారు. అలాగే వాటి వయస్సుకు తగ్గ బరువు, పొడవు ఉన్న వాటినే ఎంపిక చేసుకోవాలన్నారు. చేప పిల్లల తల పెద్దదిగా శరీరం సన్నబడి నల్లగా ఉంటే దానికి తెగులు సోకినట్టు గుర్తించాలన్నారు. ఆరోగ్యవంతమైన నిర్ణీత వయస్సున్న చేప పిల్లల పెంపకం వల్ల అధిక లాభాలు ఆర్జించవచ్చని తెలిపారు.

నేడు పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

కలిదిండి, జూలై 31: మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపీడీవో దినతేజ్ తెలిపారు. గురువారం ఉదయం ఆరు గంటల నుంచి గ్రామ సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. సాయంత్రానికల్లా 80 శాతం పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలంలో మొత్తం 9,719 మంది లబ్ధిదారులు ఉండగా, రూ.4 కోట్ల 11 లక్షల 88 వేల 500 పంపిణీ చేయాల్సి ఉందన్నారు.

పెన్షన్ల పంపిణీ సక్రమంగా నిర్వహించాలి

కైకలూరు: ప్రతి ఇంటికి పెన్షన్ పంపిణీ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు అన్నారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లే పెన్షన్ పంపిణీ చేయాలని అందుకు గ్రామస్థాయిలో సచివాలయ సిబ్బందితో పాటు వీఆర్వోల సహకారంతో అందజేయాలన్నారు. ఎక్కువమంది లబ్ధిదారులు ఉన్న గ్రామాల్లో అంగన్వాడీ, ఆశావర్కర్ల సహాయంతో పంపిణీ జరగాలన్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పంపిణీ చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెలా ఇకపై ఒక్కో లబ్ధిదారుకు రూ.4 వేలు మొదటిరోజే నూరు శాతం పంపిణీ అయ్యేలా చూడాలన్నారు. కైకలూరు మండలంలో 9582 మంది పెన్షన్ దారులకు గాను రూ.3 కోట్ల 83 లక్షల 28 వేలు నగదు పంపిణీ చేయవలసి ఉందన్నారు. సచివాలయ సిబ్బంది సమన్వయంతో ఉదయం 6 గంటలకే పెన్షన్ పంపిణీ ప్రారంభించాలన్నారు.

ముదినేపల్లి: సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ గురువారం ఉదయం ప్రారంభమవుతుందని ముదినేపల్లి ఎంపీడీవో ఎస్.మురళీ గంగాధరరావు తెలిపారు. మండలంలోని 9022 మంది పెన్షనర్లకు రూ.3.82 కోట్ల సొమ్ము పంపిణీ చేసేందుకు నగదును సిద్ధం చేసినట్టు తెలిపారు. పెన్షనర్లు ఎవరూ గ్రామ సచివాలయాలకు రానవసరం లేదని, ఇళ్ల వద్దే సచివాలయ సిబ్బంది పెన్షన్లు పంపిణీ చేస్తారని తెలిపారు.

మండవల్లి: మండలంలో మొత్తం 6946 పింఛన్ల లబ్ధిదారులకు గురువారం ఉదయం 5 గంటల నుంచే పంపిణీ జరుగుతుందని మండవల్లి ఎంపీడీవో ఆర్ బేబి లక్ష్మి తెలిపారు. ఈ నెలలో దివ్యాంగులకు రూ.6 వేలు, మిగతా వారికి రూ.4వేలు చొప్పున పంపిణీ జరుగుతుందని తెలిపారు. మండలంలో పంపిణీ చేసే పింఛన్ల మొత్తం రూ. 2 కోట్ల 38 లక్షల 24 వేల 500 అని తెలిపారు. పెన్షన్‌దారులంతా సిబ్బందికి అందుబాటులో ఉండి సహకరించాలని కోరారు.

ఆగిరిపల్లి: ఎన్టీఆర్ భరోసా పింఛన్‌దారుల ఇళ్ల వద్దే గురువారం గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు నగదు బట్వాడా చేస్తారని ఎవరూ గ్రామ సచివాలయానికి రావద్దని పంచాయతీ కార్యదర్శి బొల్లినేని ప్రసాద్ తెలిపారు. లబ్ధిదారులు ఆధార్ కార్డుతో ఇంటివద్దే ఉండాలని తెలిపారు.

మంత్రి చేతుల మీదుగా..

ముసునూరు: మండలంలోని కాట్రేనిపాడు, గోపవరం గ్రామాల్లో గురువారం జరిగే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు కాట్రేనిపాడు, 8 గంటలకు గోపవరంలో మంత్రి చేతుల పెన్షన్ పంపిణీ జరుగుతుందని, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని ఆమె కోరారు.

అందుబాటులో లేని 108.. ఒకరి మృతి

ఆగిరిపల్లి, జూలై 31: ఆగిరిపల్లి ప్రభుత్వాసుపత్రికి 108 అంబులెన్స్ సేవలు అందుబాటులోకి రావడం లేదు. సాక్షాత్తు పీహెచ్‌సీ వైద్యాధికారి ఫోన్ చేసినా స్పందించలేదు. బుధవారం రత్తయ్య అనే వ్యక్తికి గుండె పోటు రాగా మెరుగైన వైద్యం కోసం విజయవాడ నగరానికి పంపడానికి ప్రయత్నించగా అంబులెన్స్ అందుబాటులో లేదని సమాధానం వచ్చింది. దీంతో రత్తయ్య మరణించాడు. రెండు రోజుల క్రితం నెలలు నిండకుండా బిడ్డను ప్రసవించిన తల్లిని, బిడ్డను విజయవాడ పంపాలని ఇలాగే 108కి ఫోన్‌చేయగా, అప్పుడు కూడా రాలేదని పీహెచ్‌సీ వైద్యాధికారి జగన్‌మోహన్‌రావు తెలిపారు. మండల కేంద్రమై ఉండి రోజుకి 100 మంది అవుట్ పేషెంట్లు వస్తున్న ప్రభుత్వాసుపత్రికి ఇలాంటి అసౌకర్యం కలగడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కలిదిండి తహసీల్దార్ బదిలీ

కలిదిండి, జూలై 31 : కలిదిండి తహసీల్దార్ దశిక వంశీ బదిలీ అయ్యారు. ఈ మేరకు కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్వర్వుల మేరకు పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీపై ఆయన వెళ్లారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ ఇబ్రహీం బాధ్యతలు చేపట్టారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక



కేడీవీ లక్ష్మి.. అజరయ్య
అధ్యక్ష, కార్యదర్శులు

ఆగిరిపల్లి, జూలై 31: యూటీఎఫ్ ఆగిరిపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కేడీవీ లక్ష్మి, కె. అజరయ్య ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి, ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు తెలిపారు. ఏలూరు జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తఫా ఆలీ, ప్రధాన కార్యదర్శి రవి కుమార్, కోశాధికారి జి.వి రంగ మోహన్, జిల్లా కార్యదర్శి బి.అనురాధ, మండల సీనియర్, రిటైర్డ్ ఉపాధ్యా యులు పాల్గొన్నారు. సమాఖ్య స్వర్ణోత్సవాల సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయులు బి.జీవరత్నం, ప్రభావతి దేవి దంపతులను సత్కరించారు. రవికుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు కష్టపడి పనిచేసి ప్రభుత్వ బడులను నిలుపుకోవాలని కోరారు.

నేడు ఎస్ఎంసీల ఎన్నికకు నోటిఫికేషన్

చాట్రాయి, జూలై 31: మండలంలోని 7 జడ్పీ హైస్కూళ్లు, 7 యూపీ, 49 ప్రాథమిక పాఠశాలల యాజమాన్య కమిటీలు (ఎస్ఎంసీలు)కు ఆగస్టు 1న ఎన్నికల నోటిఫికేషన్, ఓటర్ల జాబితాలు విడుదల చేస్తారని ఎంఈవో బ్రహ్మాచారి తెలిపారు. 5న ఓటర్ల జాబితాల్లో అభ్యంతరాల స్వీకరణ, తుది ఓటర్ల జాబితాల ప్రదర్శన, 8న చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక, అనంతరం ప్రమాణ స్వీకారం, ఎస్ఎంసీ తొలి సమావేశం జరుగుతుందని వివరించారు.

అంగన్వాడీలకు ఫోన్లు, డివైజ్‌లు ఇవ్వాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

చాట్రాయి, జూలై 31: సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలకు ఫోన్లు, డివైజ్‌లు ఇవ్వాలని యూనియన్ నాయకులు హేమలత, విజయ బుధవారం ఎంపీడీవో మంగా కుమారికి వినతిపత్రం అందజేశారు. ఫోన్లు, డివైజ్‌లు ఇవ్వకపోవటం వలన పెన్షన్లు పంపిణీలో ఇబ్బందుల ఎదుర్కొంటున్నామని, తెల్లవారుజామున 5 గంటల నుంచి పెన్షన్లు పంపిణీ ప్రారంభించాలంటే ఇబ్బందులు పడుతున్నామని, ఉదయం 6 నుంచి పంపిణీకి అనుమతి ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

నిధుల కోసం మంత్రికి వినతి

ఆగిరిపల్లి, జూలై 31: నిధుల లేమితో సతమతమవుతున్న ఆగిరిపల్లి పంచాయతీకి నిధులివ్వాలంటూ బుధవారం రాత్రి తాడిగడపలోని మంత్రి కార్యాలయంలో ఆయనను టీడీపీ నాయకులు చవటపల్లి విక్టర్, గోళ్ల రాజు, ఉలాస గోపి, మైనార్టీ నాయకుడు ఖాదర్ బాషా కలసి విన్నవించారు. వీరి అభ్యర్థన మేరకు రూ. 3 కోట్ల గ్రాంటు విడుదలకు మంత్రి కొలుసు పార్థసారథి సానుకూలంగా స్పందించినట్టు ఆగిరిపల్లి సర్పంచ్ లక్ష్మీ విక్టర్ తెలిపారు.

కాపురాని వంగ తోట పరిశీలన



చాట్రాయి, జూలై 31: మండలంలోని పోలవరంలో రైతు ఎర్రా సీతారామాంజనేయులుకు చెందిన వంగ తోటను బుధవారం ఉద్యానశాఖాధికారిణి ఆర్. హేమ పరిశీలించారు. ఇటీవల ఆయన వంగతోట కాపు రాక తీవ్రంగా నష్టపోయానని మంత్రి పార్థసారథికి వినతిపత్రం ఇవ్వటంతో హెచ్‌వో పరిశీలించారు. హేమ మాట్లాడుతూ సన్‌గ్రో రకం (వైట్ రౌండ్) సాగు చేశారని, చాట్రాయి మండలం వాతావరణానికి నల్ల వంగ రకాలు అనువుగా ఉంటాయని చెప్పారు.

వరి నాట్లపై అవగాహన



ముదినేపల్లి, జూలై 31: వరినాట్లు వేసే విధానంపై రైతులకు ముదినేపల్లి మండలం సింగరాయపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధులు అవగాహన కల్పించారు. పొలాల్లో వరి నారును ఎలా నాటాలో ఆ విభాగం మండల ఇన్‌చార్జి గౌతమ్ కుమార్ చూపించారు. నాటేసే ముందు నారు కొసలు తుంచాలని, వరుస పద్ధతిలో మొక్కకు, మొక్కకు మధ్య అడుగు దూరం ఉండేలా చూడాలని తెలిపారు. ఈ విధానంలో వరి మొక్క గట్టి పడుతుందని, చీడపీడలు సోకే పరిస్థితి తగ్గుతుందని ఆయన రైతులకు వివరించారు.

కృష్ణారావుపాలెంలో ఫాగింగ్

చాట్రాయి, జూలై 31: మంత్రి పార్థసారథి ఆదేశాల మేరకు, సర్పంచ్ చిమట బోయన పుల్లారావు ఆధ్వర్యంలో మండలంలోని కృష్ణారావుపాలెంలో బుధవారం దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని, వేడి ఆహారం తినాలని, జ్వర లక్షణాలు కన్పిస్తే పీహెచ్‌సీకి వెళ్ళి చికిత్స పొందాలని సర్పంచ్, అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు లంచ్ బాక్సుల వితరణ



ఆగిరిపల్లి, జూలై 31: శోభనాపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న గంటా సుధారాణి బంధువు, రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగి అయిన రామచంద్రరావు పాఠశాల విద్యార్థులకు సుమారు రూ.25 వేలు విలువైన నోట్ పుస్తకాలను, లంచ్ బాక్స్‌లు, తినుబండారాలను విద్యార్థులకు అందించారు. సుధారాణి ఏ పాఠశాలలో పనిచేసినా ఆ పాఠశాలకు ఇటువంటి సేవా కార్యక్రమాలు గత పదేళ్లుగా చేస్తుండడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

స్టూడెంట్స్ కిట్ల పంపిణీ



కలిదిండి, జూలై 31 : మట్టగుంట ప్రభుత్వ పాఠశాలలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంగ్రాజు శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు ఎన్.బాల కృష్ణతో కలసి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్టూడెంట్స్ కిట్స్‌ను పంపిణీ చేశారు. కూటమి నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.